www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 27 | | 2-7-2026 | | గురువారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## 14,115 కోట్లతో మెగా హైవే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్!



- ప్రధాని మోదీ అధ్యక్షతన కేబినెట్ భేటీ
- భారీ రహదారుల ప్రాజెక్టులకు ఆమోదం

4

## బాలికపై 30మంది అఘాయిత్యం

- బలవంతంగా మద్యం తాగించి దారుణం
- నిందితుల 4 హోటళ్లపై బుల్డోజర్ యాక్షన్
- ఇప్పటివరకు పన్నెండు మంది అరెస్ట్

4

రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో 13 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక లైంగికదాడి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో బాధిత బాలికపై ఐదు రోజుల పాటు 30 మందికి పైగా వ్యక్తులు పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఘటనపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం యాక్షన్‌కు దిగింది.







## ఏఐతో ట్రాఫిక్ నియంత్రణ!

- ఫిజికల్ ఇంటెలిజెన్స్‌తో సత్వర పరిష్కారాలు
- ఎంసీహెచ్ఆర్డీలో సీఎం రేవంత్ కీలక భేటీ
- అనలాగ్, మెగా సంస్థలతో ఒప్పందం

2వ పేజీలో..

# నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వద్దు

### వాస్తవికత ఆధారంగానే బడ్జెట్ రూపకల్పన జరగాలి

- శాఖల వారీగా సామర్థ్యం మెరుగు పరుచుకోవాలి
- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి బడ్జెట్ కేటాయింపులు
- ఏఐ టెక్నాలజీతో డీబీటీకి అనుసంధానం
- భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎంసీహెచ్ఆర్డీలో అధికారులకు దిశానిర్దేశం

**ఆదాయ సమీకరణ కోసం ప్రత్యేక ఛేజింగ్ సెల్**

రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఎంసీహెచ్ఆర్డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ తదితర వివిధ శాఖలకు సంబంధించి ఎక్కడా లీకేజీలు లేకుండా జాగ్రత్త వహించాలని సీఎం సూచించారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ప్రత్యేకంగా ఛేజింగ్ సెల్ ఏర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనులు జరగాలంటే శాఖల వారీగా అధికారుల పని సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని దిశానిర్దేశం చేశారు.

2వ పేజీలో..

## చర్చకు రెడీ!

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చిద్దాం
- తేదీ, సమయం చెబితే రావడానికి సిద్ధం
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

3



## ఈగల్ టీమ్ దాడులు

మణికొండలో హాష్ ఆయిల్ విక్రేత పట్టివేత

## ఓఆర్ఆర్‌పై కాల్పులు

- పోలీసులపై క్రిమినల్ దాడి
- పోలీసుల ఎదురుకాల్పులు
- శ్రీకాంత్ కాలికి తగిలిన బుల్లెట్లు
- హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



3

## ఎజెండా మారాలి!

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- మూసీకి లక్ష కోట్లు ఎలా
- అధికారంలోకి వస్తే ఉచిత విద్య
- రేవంత్ పాలనపై కవిత ఫైర్



2

## రైతుల పేరిట డ్రామాలు!

- దృష్టి మరల్చేందుకే కొత్త ఎత్తుగడలు
- వైఫల్యాలపై ఎక్కడైనా చర్చకు సిద్ధం
- సీఎం రేవంత్‌కు హరీశ్ రావు





## మీ సేవలు అమోఘం!

ప్రాణాలను కాపాడుతున్న ప్రభుత్వ వైద్యులు

రాష్ట్రంలో నాణ్యమైన వైద్య సేవలు

2

## రైతులను బెదిరించి డబ్బులు వసూలు

ఫిర్యాదుతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరెస్ట్

3



## రూ.3 కోట్ల లంచం కేసు

ఐపీఎస్ అధికారి దీపక్ గహ్లోవత్ 3 కోట్ల రూపాయల లంచం కేసులో సీబీఐ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. కేసు వివరాలను అధికారులు బుధవారం మీడియాకు వెల్లడించారు.

4

## నేడు కేబినెట్ భేటీ!

- సచివాలయంలో రాష్ట్ర మంత్రిమండలి సమావేశం
- మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ భేటీ
- అందుబాటులో ఉండాలని సీఎస్ ఆదేశాలు
- మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుపై ప్రధాన చర్చ
- మెట్రో విస్తరణపై కార్యాచరణ రూపకల్పన

2



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# నేడు కేబినెట్ భేటీ!

**సచివాలయంలో రాష్ట్ర మంత్రిమండలి సమావేశం**

**మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ భేటీ**

**అందుబాటులో ఉండాలని సీఎస్ ఆదేశాలు**

**మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుపై ప్రధాన చర్చ**

**మెట్రో విస్తరణపై కార్యాచరణ రూపకల్పన**

**హైదరాబాద్, జూలై 1:** తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి (కేబినెట్) సమావేశం గురువారం జరగనుంది. సచివాలయంలో జరగనున్న ఈ భేటీలో కేంద్రం ఇటీవల ఆమోదం తెలిపిన మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర సచివాలయంలోని 6 వ అంతస్తులో ఉన్న కేబినెట్ సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఇది 34 వ మంత్రిమండలి సమావేశం కావడం గమనార్హం. ఈ కేబినెట్ భేటీ జరిగే సమయంలో అధికారులందరూ తప్పనిసరిగా తమ హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సీఎస్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. వివిధ కీలక అంశాలపై ఈ కేబినెట్ సమావేశంలో మంత్రులు చర్చించనున్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టుకు అధికారికంగా ఆమోదం తెలిపింది. అదేవిధంగా నగరంలో మెట్రో రైలు విస్తరణకు కూడా పచ్చజెండా ఊపింది. ఈ క్రమంలో ఈ భారీ ప్రాజెక్టుల విషయంలో ముందుకెళ్లేందుకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపైన కేబినెట్‌లో ప్రధానంగా చర్చించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

# రేవంత్ పదవి మరికొన్ని నెలలు మాత్రమే

**సీఎం రేవంత్‌పై బీజేపీ తీవ్ర ఆగ్రహం**

**నితిన్ నబీన్‌పై విమర్శలకు స్ట్రాంగ్ కౌంటర్**

**మీ రోజులు దగ్గరపడ్డాయని శుక్లా హెచ్చరిక**

**న్యూఢిల్లీ, జూలై 1:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను సీఎం రేవంత్ ఎగతాళి చేయడంపై ఆ పార్టీ జాతీయ ప్రతినిధి ప్రేమ్ శుక్లా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మీ రోజులు దగ్గరపడ్డాయంటూ ఆయన ఘాటుగా హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌తో తెలంగాణను పోల్చడంపై తెలంగాణ సీఎంకు ప్రేమ్ శుక్లా గట్టి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ నేతల అహంకారం, వారి చంచల రాజకీయం త్వరలోనే కుప్పకూలుతుందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాజయం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అహంకారానికి త్వరలోనే తెరపడనుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే ఇప్పుడు కాంగ్రెస్‌కు పడుతుందని ప్రేమ్ శుక్లా హెచ్చరించారు. రేవంత్ రెడ్డి కళ్లు తెరిచి చూడాలని, 22 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ అని ఆయన గుర్తుచేశారు. 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పదవి మరికొన్ని నెలలు మాత్రమే ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ రోజులు దగ్గరపడ్డాయంటూ బీజేపీ నేత ప్రేమ్ శుక్లా తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# మీ సేవలు అమోఘం!

**ప్రాణాలను కాపాడుతున్న ప్రభుత్వ వైద్యులు**

**రాష్ట్రంలో నాణ్యమైన వైద్య సేవలు**

**ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్, జూలై 1:** జాతీయ వైద్యుల దినోత్సవం (డాక్టర్స్ డే) సందర్భంగా రాష్ట్రంలోని వైద్యులందరికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన కొనియాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న వారి సేవలు వైద్య వ్యవస్థకు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. తమ నైపుణ్యంతో ప్రతిరోజూ వేలాది ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రశంసించారు. రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, తగిన మానవ వనరులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 440 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, సుమారు 800 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. డాక్టర్లతో పాటు ఇతర పోస్టులను కూడా పెద్ద సంఖ్యలో భర్తీ చేశామని, మొత్తంగా సుమారు 15 వేల పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డెంటిస్టుల ఆకాంక్షను నెరవేరుస్తూ 48 డెంటల్ సర్జన్ పోస్టులను భర్తీ చేశామన్నారు. ఈ రెండున్నరేళ్లలో సుమారు 1,300 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పించినట్లు వివరించారు. డాక్టర్ల దశాబ్దకాల ఆకాంక్ష అయిన ఉస్మానియా నయా ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రారంభించామని, అలాగే గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో నూతన హాస్టళ్ల నిర్మాణం పూర్తికావొచ్చిందని మంత్రి తెలిపారు. వైద్యులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, ఇతర సిబ్బందికి మెరుగైన వర్క్ ఎన్విరాన్మెంట్ కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం మేర పెంచామని గుర్తుచేశారు. అద్దె భవనాలు, పాత భవనాల్లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆధునిక భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ వైద్యుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, సేవలను మరింత అంకితభావంతో కొనసాగించాలని మంత్రి కోరారు.

# నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వద్దు

- సామర్థ్యం మెరుగు పరుచుకోవాలి
- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి బడ్జెట్
- ఏఐ టెక్నాలజీతో డీబీటీకి అనుసంధానం
- ప్రత్యేక ఛేజింగ్ సెల్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జూలై 1:** రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఎంసీహెచ్ఆర్డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ తదితర వివిధ శాఖలకు సంబంధించి ఎక్కడా లీకేజీలు లేకుండా జాగ్రత్త వహించాలని సీఎం సూచించారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ప్రత్యేకంగా ఛేజింగ్ సెల్ ఏర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనులు జరగాలంటే శాఖల వారీగా అధికారుల పని సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**ఏఐ టెక్నాలజీతో అనుసంధానం..**

తాజా ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను నేరుగా డీబీటీకి అనుసంధానం చేసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులతో పాటు ఇతర కీలక పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగానే బడ్జెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల కోసం భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు.

**వాస్తవికత ఆధారంగానే బడ్జెట్..**

కేవలం ఊహాజనిత బడ్జెట్ కాకుండా.. వాస్తవికత ఆధారంగానే బడ్జెట్‌ను రూపొందించుకోవాలని అధికారులకు సీఎం తేల్చిచెప్పారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏఐతో ట్రాఫిక్ నియంత్రణ!

- ఎంసీహెచ్ఆర్డీలో సీఎం రేవంత్ కీలక భేటీ
- అనలాగ్, మెగా సంస్థలతో ఒప్పందం
- ఏఐ ఆధారంగా సిగ్నల్స్ పనిచేయాలి
- ఫిజికల్ ఇంటెలిజెన్స్ తో సత్వర పరిష్కారాలు
- మెరుగైన మౌలిక సదుపాయాల అభివృద్ధి



**హైదరాబాద్, జూలై 1:** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ తదితర సమస్యల పరిష్కారానికి అత్యాధునిక సాంకేతికతను వినియోగించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మన్, మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎంఈఐఎల్) ఎండీ పి. కృష్ణారెడ్డి తదితరులతో ఎంసీహెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ ప్రతినిధులు, హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనలాగ్, ఎంఈఐఎల్ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపట్టే ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా ప్రధానంగా చర్చించారు. భవిష్యత్ తరాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై ఆయా సంస్థల ప్రతినిధులు సీఎంకు వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను ఆయన ముందు ఉంచారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారం చూపే సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు. సెన్సార్లు, రోబోటిక్స్ లాంటి ఫిజికల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో పట్టణ రవాణా వ్యవస్థను ఎలా సమర్థవంతంగా, భద్రంగా అభివృద్ధి చేయవచ్చో వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి సిగ్నల్స్ నిర్వహించడం, నీటి లీకేజీలను ముందే పసిగట్టి మరమ్మతులు చేయడం, అత్యవసర సమయాల్లో అంబులెన్స్, ఫైర్ ఇంజన్లకు ట్రాఫిక్ క్లియర్ చేయడం లాంటి పనులకు ఏఐ టెక్నాలజీ ఎలా ఉపయోగపడుతుందో ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ నగరంలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ అన్నింటినీ ఇంటిగ్రేట్ (అనుసంధానం) చేయాలని ఆయన ఆదేశించారు. కేవలం టైమర్ల ఆధారంగా కాకుండా ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని తీసుకురావాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా ఈ సిస్టమ్‌ను ఏఐ సాంకేతికతకు అనుసంధానించాలని సూచించారు. ఈ సమావేశం అనంతరం సీఎం సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్త భాగస్వామ్యంతో ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. పరస్పర సాంకేతిక సహకారం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ఒప్పందం భవిష్యత్తులో కీలకంగా మారనుంది.

# రైతుల పేరిట డ్రామాలు!

- దృష్టి మరల్చేందుకే కొత్త ఎత్తుగడలు
- రైతుల అసలు సమస్యలపై పట్టని వైనం
- వైఫల్యాలపై ఎక్కడైనా చర్చకు సిద్ధం
- సీఎం రేవంత్‌కు హరీశ్ రావు సవాల్



**హైదరాబాద్, జూలై 1:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి రైతుల పేరిట కొత్త డ్రామాలకు తెరతీశారని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై ఆయన విరుచుకుపడ్డారు. రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేస్తూ, అన్నదాతల అసలు సమస్యలను పక్కన పెట్టేసి గొప్పలు చెప్పుకోవడం తప్ప ఈ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని హరీశ్ రావు ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మాట్లాడేవన్నీ చేతగాని మాటలు, చెత్త వాగుడు తప్ప వాటి వల్ల రైతులకు కొత్తగా ఒరిగింది ఏమీ లేదన్నారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కల్లోని డొల్లతనాన్ని ఆయన ఆధారాలతో సహా ఎండగట్టారు.

**ఎవరి లెక్కలు నిజం?**

ఒకే సభలో ఉంటూ.. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రైతుల కోసం 1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం 1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, అసలు వీరిద్దరిలో ఎవరి లెక్కలు నిజమని హరీశ్ రావు ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో చేసింది ఏమీ లేదు కాబట్టే ఇద్దరూ ఇష్టం వచ్చినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

**బడ్జెట్‌లో లేని డబ్బును..**

2027 మార్చి 31 వరకు వ్యవసాయ రంగానికి చేసిన మొత్తం బడ్జెట్ కేటాయింపులే సుమారు 82 వేల కోట్లు అయితే, జూన్ 2026 నాటికే లక్షా 56 వేల కోట్లు, లక్షా 75 వేల కోట్లు ఎలా ఖర్చు చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. బడ్జెట్‌లో లేని డబ్బును ఖర్చు చేశారా? లేక రైతులను మభ్యపెట్టడానికి కల్పిత లెక్కలు చెబుతున్నారా? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలను పదిసార్లు చెప్పినా అవి నిజాలు కావని, లేనివి ఉన్నట్లు చెప్తే రైతులు నమ్మరని హితవు పలికారు.

**దారుణంగా మోసం చేశారు..**

ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఓట్లు అడిగారని, తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కేవలం స్వల్పకాలిక రుణాలకే మాఫీ వర్తిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులను దారుణంగా మోసం చేయడమే కాదా అని హరీశ్ రావు ప్రశ్నించారు. ఇదే ముందే చెప్పి ఉంటే రైతులు కాంగ్రెస్‌ను నమ్మేవారా అని అడిగారు. మేనిఫెస్టోలో ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఫేక్ ప్రచారాలు చేసుకోవడం ఆపి, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను ఎలా గాలికి వదిలేశారో, అన్నదాతను ఎలా మోసం చేశారో నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని.. దీనిపై చర్చించేందుకు కేవలం అసెంబ్లీ మాత్రమే కాదు, ఏ వేదికపైనైనా తాము సిద్ధమని హరీశ్ రావు సవాల్ విసిరారు.

# ఎజెండా మారాలి!

**హామీల అమలులో ప్రభుత్వం విఫలం**

**అధికారంలోకి వస్తే ఉచిత విద్య**

**రేవంత్ పాలనపై కవిత ఫైర్**

**హైదరాబాద్, జూలై 1:** రాష్ట్ర ఎజెండా మారాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేశామని ఆమె ఉద్ఘాటించారు. తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా పేద ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే మళ్లీ అధికారంలోకి వస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలలు కంటున్నారని ఆమె తీవ్ర స్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు లేవని చెబుతూ.. మరోవైపు మూసీ ప్రాజెక్టు కోసం 1 లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని ప్రభుత్వం చెప్పడం ఏమిటని కవిత నిలదీశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదలపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ఉచిత విద్యతో పాటు ఉచిత వైద్యాన్ని అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కచ్చితంగా రాష్ట్ర ఎజెండా మారుస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, కేవలం హార్డ్ వర్క్‌నే నమ్ముకోవాలని కవిత దిశానిర్దేశం చేశారు.



# ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు మరింత ఆలస్యం



- పెద్దగా ప్రభావం ఉండేలా కనిపించని పరిస్థితి
- వరి బదులు ఆరుతడి పంటలపై సీఎం సూచనలు

**హైదరాబాద్, జూలై 1:** నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి కూడా ఇదే విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదని, అందువల్ల రైతులు ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలని కోరారు. వరికి అసవరమైన నీరు లభించనప్పుడు, ఆరుతడి పంటలవైపు మళ్లాలలని అన్నారు. దీంతో రైతులు కూడా ఈదిశగా ఆలోచన చేయాల్సి ఉంది. అదేపనిగా వరి పండించడం వల్ల కూడా రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఈ అవకాశాన్ని ఆసారగా తీసుకుని మార్పుకోసం ప్రయత్నిస్తే మంచిదే. ఎందుకంటే వర్షాలు పడతాయో లేదో తెలియడం లేదు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో నారు వేసే పరిస్థితి లేదు. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో సిఎం ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయంగా కనిపిస్తోంది. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది.

# వీబీ జీ రామ్ జీ ని రద్దు చేయాలి

**సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల ఆందోళన**




**ఖమ్మం, జూలై 1:** పేదలకు ఉపాధిని దూరం చేసే వీబీ జీ రామ్ జీ ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కారేపల్లి తాసీల్దార్ కార్యాలయం, ఎర్రబోడు, మాణిక్యారం, విశ్వనాథపల్లి, గాంధీనగర్, గాదెపాడు, చీమలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట అందోళన చేపట్టారు. అంక్షలు లేకుండా పేదలకు ఉపాధి కల్పించాలని, రైతులకు నష్టదాయకమైన విద్యుత్ సవరణ చట్టం, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కన్వీనర్ కె.నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీని రద్దు చేసి వీబీ జీ రామ్ జీ పేరుతో పేదలకు ఉపాధి దూరం చేయుటకు పూనుకుందన్నారు. వీబీ జీ రామ్ జీ బిల్లును జులై 1 నుండి అమలు చేయనున్నట్లు ప్రకటించిందని, దీనిలో కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం నిధులు భరాయించాలని పేర్కొనడం ఉపాధి కల్పన నుండి కేంద్రం దూరం జరగటమేనన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే రైతు భరోసా ఎగవేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు డిస్టిబ్యూషన్ కంపెనీని ఏర్పాటు చేసి ఉచిత కరెంట్ కు మంగళం పాడే పరిస్థితిని తీసుకరానుందన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల తీరుపై పోరాటాలే శరణ్యమన్నారు. పోరాటాలతోనే పాలకుల దిగివచ్చి పేదలకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పలువురు పాల్గొన్నారు.

# చర్చకు నేను రెడీ!

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చిద్దాం
- తేదీ, సమయం చెబితే రావడానికి సిద్ధం
- పదేపదే తెలంగాణను కించపరచొద్దు
- ఇజ్జత్ పోయినప్పుడు ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి?



**హైదరాబాద్, జూలై 1:** కేసీఆర్ అధికారంలో నుంచి దిగిపోయేనాటికి 3.50 లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందని, కానీ అప్పుల కారణంగా ఢిల్లీకి వెళితే ఇజ్జత్ పోతోందని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ ఢిల్లీకి 72 సార్లు ఎందుకు వెళ్లారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశంలో 50 శాతం పూర్తయిందని, ఇప్పటివరకు ఏం చేశారో ఆ పార్టీ చెప్పుకోలేకపోతోందని విమర్శించారు. రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా? అని సీఎం విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తేదీ, సమయం ఫిక్స్ చేయాలన్నారు.

## ప్రపంచమంతా ఆశ్చర్యపోయింది..

తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా కేసీఆర్ తీర్చిదిద్దారని కేటీఆర్ గుర్తుచేశారు. 2014-15 లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 26 లక్షల హెక్టార్లు మాత్రమేనని, కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయే నాటికి ఆ సంఖ్య 59 లక్షల హెక్టార్లకు చేరిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ముందడుగు వేసి అద్భుతాలు చేశామన్నారు. హైదరాబాద్‌ను చూసి న్యూయార్క్‌లా ఉందని రజినీకాంత్ అన్నారని, మేఘాలయ సీఎం సంగ్మా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను చూసి అభినందించారని, ఫాక్స్‌కాన్ చైర్మన్ కూడా గతంలో ప్రశంసలు కురిపించారని వివరించారు.

## రాష్ట్రాన్ని కించపరుస్తున్నారు..

సీఎం రేవంత్ పదేపదే రాష్ట్రాన్ని కించపరుస్తూ అవమానిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మమ్మల్ని దూషించండి, కేసులు పెట్టుకోండి.. కానీ తెలంగాణను దూషించవద్దు, ప్రజల మనోభైర్యాన్ని దెబ్బతీయవద్దు అని హితవు పలికారు. ఇంతటి భావదారిద్ర్యం ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదన్నారు. తెలంగాణ గొప్పదనం రేవంత్‌కు జీర్ణం కాకపోవచ్చని, పరిపాలన చేతగాక గత ప్రభుత్వంపై ఇంకా ఎన్ని రోజులు ఏడుస్తారని నిలదీశారు. సీఎం, డిప్యూటీ సీఎం అబద్ధాలు చెప్పడంలో కూడా పొంతన లేదని, కాగ్ లెక్కలు నమ్మాలా? కాకి లెక్కలు నమ్మాలా? అని ప్రశ్నించారు. సీఎం, కుటుంబ సభ్యుల దోపిడీతో రాష్ట్రం ఆస్తులు కోల్పోతోందన్నారు. దండుపాళ్యం ముఠాలా కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఆరోపించారు. రాహుల్ బంధు, పొంగులేటి బంధు, సోదరుల బంధు బంద్ చేయాలన్నారు. అబద్ధాలు ఆడటం రేవంత్‌కు జన్మహక్కు అని, ఈసారి ఆయనకు ప్రతిపక్ష పాత్ర కూడా మిగలదన్నారు. అద్భుతమైన ప్రగతిభవన్ ఉంటే దాన్ని వదిలేసి 200 కోట్లతో మరో క్యాంపు కార్యాలయం నిర్మించారని, కాంపౌండ్ వాల్ నిర్మాణానికే 19 కోట్లు ఖర్చు చేశారని దుయ్యబట్టారు.

## ఎక్కడైనా నేను రెడీ..

కాంగ్రెస్ పాలనపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని, తేదీ, సమయం ఫిక్స్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీనా? ప్రెస్‌క్లబ్‌లోనా? జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లోనా? ఎక్కడైనా తాను రెడీ అన్నారు. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ చౌరస్తానా? 2 లక్షల ఉద్యోగాలని రాహుల్ గాంధీ డైలాగులు కొట్టిన అశోక్‌నగర్ చౌరస్తానా? మీరు వస్తారో, రాహుల్ గాంధీ వస్తారో రండి అని సవాల్ విసిరారు. మీ తప్పులను గణాంకాలతో సహా బయటపెడతామని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# బైక్ దొంగల అరెస్ట్!

- అత్తాపూర్ పోలీసుల చేతికి చిక్కిన ముఠా
- ఇద్దరు పాత నేరస్థులకు కోర్టు రిమాండ్
- పరారీలో ఉన్న మరో ఇద్దరు
- 5 ద్విచక్ర వాహనాల స్వాధీనం
- సీసీటీవీ కెమెరాలతో నిందితుల గుర్తింపు

**హైదరాబాద్, జూలై 1:** జల్సాలు, చెడు వ్యసనాలకు బానిసలై బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరు పాత నేరస్థులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శివరాంపల్లి పిల్లర్ నంబర్ 295 వద్ద ఇటీవల రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ దొంగతనం జరగడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సీసీటీవీ కెమెరాల ఆధారంగా దొంగలను అత్తాపూర్ పోలీసులు గుర్తించారు. వెంటనే రంగంలోకి దిగి నిందితులను అరెస్ట్ చేశారు. విచారణలో వీరంతా జల్సాలు, చెడు వ్యసనాల కోసమే బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది.

## గాలింపు చర్యలు ముమ్మరం..

అరెస్ట్ అయిన వారిలో మహమ్మద్ షానవాజ్, మహమ్మద్ మొయిజ్ మోహియుద్దీన్ ఉన్నట్లు అత్తాపూర్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. పరారీలో ఉన్న శాస్త్రీపురానికి చెందిన నూర్, ఫర్హాన్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాటిలో రాయల్ ఎన్‌ఫీల్డ్, సుజుకి బర్గ్‌మన్, యాక్టివా వాహనాలు ఉన్నాయి. అరెస్టయిన వారు గతంలోనూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ఓఆర్ఆర్ పై కాల్పులు!

- పోలీసులపై మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ దాడి
- ఆత్మరక్షణ కోసం పోలీసుల ఎదురుకాల్పులు
- బూషి శ్రీకాంత్ కాలికి తగిలిన బుల్లెట్లు
- దాడిలో హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు
- వనస్థలిపురం ఆసుపత్రికి నిందితుడి తరలింపు



**హైదరాబాద్, జూలై 1:** హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున కాల్పులు కలకలం సృష్టించాయి. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బూషి శ్రీకాంత్‌ను పట్టుకునేందుకు వెళ్లిన నల్గొండ సీసీఎస్ పోలీసులపై అతడు కత్తితో దాడి చేశాడు. దీంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో నిందితుడు తీవ్రంగా గాయపడ్డాడు. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ శ్రీకాంత్ హైదరాబాద్‌లో ఉన్నాడనే సమాచారంతో అతడిని పట్టుకునేందుకు నల్గొండ సీసీఎస్ పోలీసుల బృందం రంగంలోకి దిగింది. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ సమీపంలోని బొంగులూరు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 వద్ద శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ సమయంలో అతడు పోలీసులపై తిరగబడి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో నల్గొండ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి తలకూ గాయాలయ్యాయి. నిందితుడు తప్పించుకునేందుకు యత్నిస్తూ విచక్షణారహితంగా దాడికి దిగడంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం ముందుగా గాల్లోకి 3 రౌండ్లు కాల్పులు జరిపారు. ఆ తర్వాత నిందితుడి కాళ్లపై కాల్చారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. తలకు గాయమైన హెడ్ కానిస్టేబుల్‌ను, అలాగే గాయపడిన నిందితుడు శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం వనస్థలిపురంలోని ఆసుపత్రికి తరలించారు.

## కానిస్టేబుల్ ను చంపి..

పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌కు చెందిన బూషి శ్రీకాంత్ తొలుత చిన్నచిన్న దొంగతనాలు చేసేవాడు. 2007 లో అతడిని అరెస్టు చేసే క్రమంలో కానిస్టేబుల్ వేణుబాబును చంపి పారిపోయాడు. అప్పటి నుంచి 120 కి పైగా నేరాలు చేశాడు. ఒక్క నల్గొండ జిల్లాలోనే అతడిపై సుమారు 300 వరకు కేసులు ఉన్నట్లు సమాచారం. దీంతో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శ్రీకాంత్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు బుధవారం ఉదయం నిందితుడిని పోలీసులు పట్టుకోగలిగారు.

# ఈగల్ టీమ్ దాడులు!

- ఐటీ కారిడార్‌లో ఈగల్ టీమ్ దాడులు
- మణికొండలో హాష్ ఆయిల్ విక్రేత పట్టివేత
- ప్రైవేట్ హోటల్‌లో పట్టుకున్న అధికారులు
- నిందితుడి నుంచి 9 గ్రాముల సీజ్
- కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు




**హైదరాబాద్, జూలై 1:** హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మణికొండలో 'ఈగల్ టీమ్' బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. పక్కా సమాచారంతో ఓ ప్రైవేట్ హోటల్‌లో మెరుపు దాడులు చేసిన అధికారులు.. హాష్ ఆయిల్ విక్రయిస్తున్న వ్యక్తిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మణికొండలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని ఈగల్ టీమ్ సభ్యులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద తనిఖీలు చేపట్టగా.. 9 గ్రాముల లిక్విడ్ హాష్ ఆయిల్ దొరికింది. దానిని అధికారులు వెంటనే సీజ్ చేశారు. పట్టుబడ్డ నిందితుడితో పాటు సీజ్ చేసిన హాష్ ఆయిల్‌ను తదుపరి విచారణ నిమిత్తం స్థానిక నార్సింగి పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ వ్యక్తి డ్రగ్స్ విక్రేతా? లేక ఏజెంటా? అనే కోణంలో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హాష్ ఆయిల్‌ను నగరానికి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? దీని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు? ఐటీ కారిడార్‌లో ఎవరెవరికి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నారనే అంశాలపై నిందితుడిని పోలీసులు తీవ్రంగా విచారిస్తున్నారు. నగరంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిఘాను మరింత కఠినతరం చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

# మహారాష్ట్రలో బాబ్లీ గేట్లు ఎత్తివేత

**నిజామాబాద్,జూలై1:** మహారాష్ట్రలోని ఎగువ గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ గేట్లను సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి), మహారాష్ట్ర, తెలంగాణ ఇరిగేషన్ అధికారుల సమక్షంలో 14 గేట్లను ఎత్తివేశారు. బాబ్లీ ప్రాజెక్టులో నీటి నిల్వ స్వల్పంగా ఉండడంతో తెలంగాణ ప్రాంతానికి కేవలం 0.20 టిఎంసిల వరద మాత్రమే వచ్చింది. ఈ దశాబ్ద కాలంలో ఎగువ గోదావరి నుంచి ఇంత తక్కువ మొత్తంలో వరద రావడం ఇదే తొలిసారి అని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఎత్తిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు అక్టోబర్ 28వ తారీఖు వరకు తెరిచి ఉంటాయి. అంతర్ రాష్ట్ర జలవివాదాలు నేపథ్యంలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలంలో, ఎండాకాలంలో బాబ్జి గేట్లను ఎత్తి దిగువకు వరద వదిలిపెడుతున్నారు.

# రైతులను బెదిరించి డబ్బులు వసూలు

**ఫిర్యాదుతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరెస్ట్**

**ఆదిలాబాద్, జూలై 1:** జిల్లాలోని తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కృష్ణ నాయక్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తలమడుగు ఎస్‌హెచ్‌ఓ డి. రాధిక తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం కజ్జర్ల-దేవాపూర్ గ్రామాల మధ్య రహదారి ఇరువైపులా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్‌కు రైతులు తమ పొలాల్లోని పంట అవశేషాలను తగులబెట్టిన సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి కొంత నష్టం వాటిల్లిందని వివరించారు. దీనిని ఆసరాగా చేసుకున్న నిందితుడు కృష్ణ నాయక్, రైతులను బెదిరిస్తూ మొక్కలకు జరిగిన నష్టానికి పరిహారంగా రూ.1,50,000 ఇవ్వాలని రైతులను డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని బెదిరించాడని పేర్కొన్నారు. బెదిరింపులకు భయపడి చింతలపెల్లి జైభరత్ రెడ్డి రూ.25 వేలు, యెల్మ రఘువరన్ రెడ్డి రూ.10వేలు, తాండ్ర మహేష్ రూ.7,500, తాండ్ర నర్సింహులు రూ.7,500 చొప్పున మొత్తం రూ.50వేలు, నిందితుడికి ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కృష్ణ నాయక్‌ను అరెస్ట్ చేసినట్లు రాధిక తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి హోదాను దుర్వినియోగం చేసి ప్రజలను బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ఉద్యమ కెరటం
గురువారం
2 జూలై 2026



# ప్రజాస్వామ్యమా? నిరంకుశత్వమా?

**ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించడం పౌరుల ప్రాథమిక హక్కు. కానీ ఏపీలో ఇప్పుడు ప్రశ్నించడమే అతిపెద్ద నేరంగా మారిపోయినట్లు కనిపిస్తోంది. పాలకుల విధానాలను ఎత్తిచూపితే చాలు.. పోలీసు వ్యవస్థను ప్రయోగించి గొంతు నొక్కే అప్రజాస్వామిక సంస్కృతి పేట్రేగిపోతోంది. జర్నలిస్టు కేవీఆర్, సోషల్ మీడియా యాక్టివిస్ట్ ప్రశ్న రావణ్‌లను కిడ్నాప్ తరహాలో అరెస్టు చేసిన తీరు రాష్ట్రంలో రాజ్యమేలుతున్న నిరంకుశత్వానికి నిలువుటద్దం. కక్ష సాధింపుల కోసమే వ్యవస్థలను ఇలా దుర్వినియోగం చేస్తుంటే.. ఇక ఎన్నికలు, రాజ్యాంగం అనే పదాలకు అర్థం ఏముంటుంది?**

నేరం చేసిన వారిని చట్ట ప్రకారం అరెస్టు చేయడంలో తప్పులేదు. కానీ ఆ అరెస్టు అధికారికంగా, చట్టబద్ధంగా జరగకపోవడమే ఇక్కడ అసలు సమస్య. వారు ఏం మాట్లాడారు, ఎలా మాట్లాడారు అనేది న్యాయస్థానాలు తేలుస్తాయి. అంతమాత్రాన ఉగ్రవాదులను పట్టుకున్నట్లుగా పోలీసు బలగాలతో వచ్చి అరెస్టులు చేయాల్సిన అవసరం ఏముంది? ఏపీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఉన్నారా, అసలు ఆయన ఏమయ్యారు అనే సందేహాలు సామాన్యుల్లో సైతం వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే విపక్ష నేతలను, సామాన్య ప్రజలను, జర్నలిస్టులను టార్గెట్ చేసి అరెస్టుల పర్వానికి తెరలేపారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### పాలకులకో న్యాయమా..


అధికార పీఠం మీద కూర్చున్న వారు నిత్యం మైకుల ముందు బూతులు వాంతి చేసుకున్నా చెల్లుబాటవుతుంది. ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని చెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పూనకం వచ్చినట్లు ఊగిపోతూ 'చెప్పు తీసుకుని కొడతా' అని బూతులు మాట్లాడినా చట్టం తన పని తాను చేయదు. 'తాట తీస్తా' అని ఆయన అన్నప్పుడు లేని తప్పు.. ఇప్పుడు సమాజంలోని అణగారిన వర్గాలకు చెందిన రావణ్ లాంటోళ్లు ప్రశ్నిస్తే మాత్రం ఎందుకు నేరమవుతోంది? రాధా మనోహర్ అనే వ్యక్తి నిత్యం వీధుల్లో తిరుగుతూ వేరే మతాల దేవుళ్లను అసభ్య పదజాలంతో దూషిస్తే కేసులు నమోదు కాని పరిస్థితి. అదే వ్యక్తిని రావణ్ ప్రశ్నిస్తే మాత్రం వెంటపడి కేసులు పెడతారా?

### వర్గ దృక్పథం దాక్కుంటుందా..

ఆధిపత్య రాజకీయాలకు దన్నుగా నిలుస్తూ అణగారిన గొంతులను అణచివేసేందుకు ఏపీలో పోలీసు వ్యవస్థను పూర్తిస్థాయి-ంలో వాడుకుంటున్నారనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అధికార పక్షానికి చెందిన నాయకులు, వారి అనుచరులు సామాజిక మాధ్యమాల్లో నిత్యం అసభ్య పదజాలంతో దూషిస్తున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారు. అదే సామాన్యులు, దళిత బహుజన వర్గాలకు చెందిన వారు ప్రభుత్వాన్ని విమర్శిస్తే మాత్రం దేశద్రోహుల స్థాయిలో కేసులు నమోదు చేసి వేధిస్తున్నారు. చట్టానికి, న్యాయానికి ఒక వర్గ దృక్పథం ఉందనడానికి ఏపీలో జరుగుతున్న ఈ పరిణామాలే ప్రత్యక్ష ఉదాహరణ. ఇక్కడ రాజ్యమేలుతున్నదంతా ఆ 'మను'స్వామ్యపు వర్గ దృక్పథమే అన్నది హక్కుల సంఘాల మాట.

### సెక్షన్ల దుర్వినియోగంతో అణచివేత..

ఇటీవల ఏలూరు దళిత క్రైస్తవ సమర శంఖారావం సభలో ప్రశ్న రావణ్.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లపై బహిరంగ వ్యాఖ్యలు చేశారు. దీనిపై పిఠాపురం ఆసుపత్రి డైరెక్టర్, జనసేన నాయకుడు బొజ్జ రామ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కక్షపూరితంగా వ్యవహరించారు. రావణ్‌పై ఏకంగా బీఎన్ఎస్ 196, 352, 356(2), 356(3), 111 సెక్షన్లతో పాటు ఐటీ చట్టం సెక్షన్ 66 కింద కేసులు నమోదు చేసినట్లు చర్చ జరుగుతున్నది. హైదరాబాద్‌లో అతడిని అదుపులోకి తీసుకుని ఏపీకి తరలించి విచారిస్తున్నారు. రావణ్ చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న వారి వివరాలను సైతం పోలీసులు సేకరిస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారు.




### ఉగ్రవాదులా.. విద్రోహ శక్తులా..

పోలీసుల తీరుపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ తీవ్రంగా స్పందించారు. అరెస్టులకు ఆదేశాలు ఇచ్చేవాళ్లు పిరికివాళ్లా అని ఆయన నేరుగా ప్రభుత్వాన్ని నిలదీశారు. అరెస్టయిన కేవీఆర్, రావణ్ ఏమైనా ఉగ్రవాదులా లేక సంఘ విద్రోహక శక్తులా అని ప్రశ్నించారు. ఏపీలో జరుగుతున్నవి కిడ్నాపులు, అరాచకాలు, అణచివేత చర్యలేనని స్పష్టం చేశారు. వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని భావప్రకటనా స్వేచ్ఛపై జరుగుతున్న ఈ దాడిని పౌర హక్కుల సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అక్రమ కేసులతో అరెస్టు చేసిన తెలంగాణ జర్నలిస్ట్ కేవీఆర్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోకపోతే ప్రజాగ్రహం చవిచూడక తప్పదు.

# అయోధ్య రామాలయ విరాళాల స్కామ్

- మాజీ ట్రస్టీకి బిగుస్తున్న ఉచ్చు
- వాష్‌రూమ్‌ల్లో నగదు దాచి బయటకు తరలింపు
- సిట్ విచారణలో సంచలన విషయాలు
- అనిల్ మిశ్రా పాత్రపై అనుమానాలు
- బ్యాంక్ సిబ్బందితో కుమ్మక్కు కోణంలో దర్యాప్తు
- ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక నిఘా
- ఇప్పటికే రూ.58 లక్షల స్వాధీనం



**అయోధ్య, జూలై 1:** అయోధ్య శ్రీరామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కుంభకోణంలో మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా పాత్రపై అనుమానాలు మరింత బలపడుతున్నాయి. అరెస్టైన నిందితుల విచారణలో ఆయన పేరు పలుమార్లు ప్రస్తావనకు రావడంతో పాటు, విరాళాల లెక్కింపు ప్రక్రియలో ఆయన కూడా కీలకంగా పాల్గొనేవారని సిట్ అనుమానిస్తోంది. ఈ కేసులో అరెస్టైన నిందితుల్లో ఒకరైన అవినాష్ శుక్లా విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. విరాళాల పెట్టెల నుంచి దొంగిలించిన నగదును ఆలయం వెలుపలికి తరలించే ముందు తాత్కాలికంగా వాష్‌రూమ్‌ల్లో దాచేవారని అంగీకరించాడు. సీసీటీవీ కెమెరాల స్థానాలపై పూర్తి అవగాహన ఉండటంతో, ఒక వ్యక్తి నగదు తీసుకెళ్తుండగా మిగిలినవారు కెమెరాలకు అడ్డుగా నిలబడి అతడికి రక్షణ కల్పించేవారని వివరించాడు. అనంతరం అవకాశం దొరికినప్పుడు నగదును బయటకు తరలించేవారని వెల్లడించాడు. దర్యాప్తులో మరో కీలక అంశం కూడా బయటపడింది. విరాళాల లెక్కింపు గదికి సంబంధించిన ఒక తాళంచెవి టిన్నూ యాదవ్ వద్ద, మరొకటి బ్యాంక్ సిబ్బంది వద్ద ఉండేదని నిందితులు వెల్లడించారు. ఆలయ సిబ్బందితో పాటు కొందరు బ్యాంక్ ఉద్యోగులు కూడా ఈ అక్రమంలో కుమ్మక్కయ్యారని, దొంగిలించిన సొమ్మును వాటాలుగా పంచుకున్నట్లు సిట్ గుర్తించినట్లు సమాచారం. దొంగిలించిన విరాళాలతో భూములు, ఇళ్లను కొనుగోలు చేసినట్లు నిందితులు అంగీకరించడంతో, వారి ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా ఆస్తుల పెరుగుదలపై కూడా సిట్ విచారణ కొనసాగిస్తోంది. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అవకతవకలపై ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రాతో పాటు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇటీవల తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ వ్యవహారంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. సిట్ విచారణ ప్రారంభానికి ముందే పోలీసులు రూ.58 లక్షల నగదును స్వాధీనం చేసుకోగా, ఈ కుంభకోణంలో మరికొందరి పాత్రపై కూడా విచారణ కొనసాగుతోంది.

# బాలికపై 30మంది అఘాయిత్యం

- బలవంతంగా మద్యం తాగించి దారుణం
- రాజస్థాన్‌లో నిందితుల 4 హోటళ్లపై బుల్డోజర్ యాక్షన్
- ఇప్పటివరకు పన్నెండు మంది అరెస్ట్
- బలవంతంగా మద్యం తాగించి దారుణం



**జైపూర్, జులై 1:** రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో 13 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక లైంగికదాడి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో బాధిత బాలికపై ఐదు రోజుల పాటు 30 మందికి పైగా వ్యక్తులు పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఘటనపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం యాక్షన్‌కు దిగింది. కేసుతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నాలుగు హోటళ్లను బుల్డోజర్లతో కూల్చివేసింది. నిందితులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హరిశంకర్ హామీ ఇచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. జూన్ 18న ఇంటి నుంచి అదృశ్యమైన బాలికను ఓ ఆటోరిక్షా డ్రైవర్ స్థానిక హోటల్ యజమానికి విక్రయించినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం ఐదు రోజుల పాటు నగరంలోని పలు హోటళ్లకు తరలిస్తూ 30 మందికి పైగా వ్యక్తులు ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఎఫ్ఐఆర్ ప్రకారం.. పలువురు హోటల్ యజమానులు, నిర్వాహకులు కూడా ఈ ఘోరానికి సహకరించడమే కాకుండా.. జరిగిన నేరాన్ని దాచిపెట్టేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధిత బాలిక ఇచ్చిన వాంగ్మూలంలో.. నొప్పితో ఏడుస్తుంటే తనకు బలవంతంగా మద్యం తాగించేవారని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 12 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

### ప్రజల్లో ఆగ్రహం.. ఉరిశిక్ష డిమాండ్

ఈ అమానుష ఘటనపై శ్రీగంగానగర్ జిల్లాలో భారీ నిరసనలు కొనసాగుతున్నాయి. నిందితులకు ఉరిశిక్ష విధించాలని, అక్రమంగా నిర్మించిన హోటళ్లన్నింటినీ కూల్చివేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. మరోవైపు స్థానిక కాంగ్రెస్ పార్టీ కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టి.. ఈ ఘటనను అడ్డుకోవడంలో పరిపాలన విఫలమైందని ఆరోపించింది. కేసులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

# రూ.3 కోట్ల లంచం కేసు..

- ఐపీఎస్ అధికారి దీపక్ గహ్లోవత్ అరెస్ట్



**న్యూఢిల్లీ, జులై 1:** ఐపీఎస్ అధికారి దీపక్ గహ్లోవత్ అరెస్ట్ అయ్యారు. 3 కోట్ల రూపాయల లంచం కేసులో సీబీఐ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. కేసు వివరాలను అధికారులు బుధవారం మీడియాకు వెల్లడించారు. ఆ వివరాల మేరకు.. దీపక్ ఢిల్లీలోని బీసీఏఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. నకిలీ మందుల తయారీ రాకెట్ కేసులో ఆయన 3 కోట్ల రూపాయలు లంచం అడిగినట్లు అధికారులకు తెలిసింది. ఈ నేపథ్యంలోనే దీపక్ నివాసం, కార్యాలయంలో సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. డిజిటల్ పరికరాలు, హార్డ్ డిస్కులు, కీలక పత్రాలతో పాటు 90 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మందుల తయారీ కేసులో జూన్ 8వ తేదీన సీబీఐ అధికారులు ఢిల్లీ పోలీస్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ సింగ్, మధ్యవర్తి రాజ్ కుమార్, వ్యాపారవేత్త ఎన్ రాజాపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదే రోజు సాయంత్రం సింగ్, రాజ్‌కుమార్‌తో పాటు మరో ఐదుగురిని అరెస్ట్ చేశారు. విచారణ సందర్భంగా దీపక్ పేరు వెలుగులోకి వచ్చింది. తన ఇన్‌ఫ్లుయెన్స్ ఉపయోగించి నకిలీ మందుల తయారీ కేసు నుంచి బయటకు తీసుకు వస్తానని దీపక్.. ఎన్ రాజాకు మాటిచ్చారు. ఇందుకోసం 3 కోట్ల రూపాయలు ఇవ్వమని అడిగారు. అదికూడా 1.5 కోట్ల రూపాయలు ముందుగానే చెల్లించాలని దీపక్ కోరారు. ఏరోసిటీలోని దీపక్ ఆఫీస్‌లో ఈ మేరకు ఓ ఒప్పందం కుదిరింది. దీపక్, ఎన్ రాజాల మధ్య సింగ్ మీడియేటర్‌గా వ్యవహరించాడు. ఎన్ రాజా హవాలా ద్వారా కోటి రూపాయలు సమకూర్చి సింగ్‌కు ఇచ్చాడు. సింగ్ సగం డబ్బులను మరో మీడియేటర్ ప్రభాత్‌కు ఇచ్చాడు. ప్రభాత్ తన ఆఫీస్‌లో 25 లక్షల రూపాయలు ఉంచుకుని మిగితాది వేరే వాళ్లకు ఇచ్చేశాడు. ఈ నేపథ్యంలోనే సీబీఐ అధికారులు సింగ్‌తో పాటు రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. వీరి అరెస్ట్‌తో దీపక్ గుట్టురట్టయింది.

# రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

### ఏడుగురి సజీవదహనం

**దౌసా, జులై 1:** రాజస్థాన్‌లో ఈ తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. దౌసా జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు, నిలిపి ఉంచిన ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే వాహనాల్లో మంటలు చెలరేగడంతో ఘటనా స్థలంలోనే ఏడుగురు ప్రయాణికులు సజీవదహనమయ్యారు. స్థానిక సమాచారం ప్రకారం.. బస్సు వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న ట్రక్కును వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు క్షణాల వ్యవధిలోనే బస్సులో భారీగా మంటలు వ్యాపించాయి. ప్రయాణికులు నిద్రమత్తులో ఉండటంతో ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే మంటలు బస్సు మొత్తాన్ని చుట్టుముట్టాయి. ఏడుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. 22 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

# 14,115 కోట్లతో మెగా హైవే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్!

### ప్రధాని మోదీ అధ్యక్షతన కేబినెట్ భేటీ
### భారీ రహదారుల ప్రాజెక్టులకు ఆమోదం
### కోట్ల రూపాయల నిధుల కేటాయింపు



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ (కేబినెట్) సమావేశంలో దేశ మౌలిక వసతుల రంగానికి ఊతమిచ్చేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని సాక్షి ఢిల్లీ ప్రతినిధి ప్రత్యేక కథనంలో వెల్లడించారు. దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ధ్యేయంగా, మొ-ంత్తం రూ. 14,115 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టనున్న రెండు అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. ఇందులో భాగంగా రాజధాని ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులను శాశ్వతంగా అధిగమించేందుకు మరియు ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు వీలుగా ఢిల్లీ నగరంలో ఒక అత్యాధునిక ఆరు లేన్ల భూగర్భ సొరంగ మార్గం (టన్నెల్ రోడ్డు) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ రవాణా ఆధునీకరణ ప్రణాళికలలో భాగంగా ఢిల్లీ పరిధిలోని ప్రముఖ ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవే, నెల్సన్ మండేలా మార్గ్, వసంత్ కుంజ్ ప్రాంతాల మధ్య అత్యంత సులువైన కనెక్టివిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం నిర్మించనున్న ప్రత్యేక టన్నెల్ రోడ్డు ప్రాజెక్టు కోసమే కేంద్ర ప్రభుత్వం ఏకంగా రూ. 6,970 కోట్ల భారీ నిధులను కేటాయించింది. ఈ సొరంగ మార్గం అందుబాటులోకి వస్తే రాజధానిలోని అత్యంత రద్దీ ప్రాంతాల మధ్య వాహనాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. దీనితో పాటు ఉత్తర ప్రదేశ్ (యూపీ) రాష్ట్రంలో రవాణా అనుసంధానతను పెంచేందుకు కాన్పూర్ నగరం నుండి కన్నౌజ్ వరకు సరికొత్తగా ఫోర్-లేన్ (4-లేన్ల) యాక్సెస్ కంట్రోల్డ్ హైవే నిర్మాణానికి కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం ప్రకటించింది. ఈ రెండు మెగా ప్రాజెక్టుల ద్వారా ఆయా రాష్ట్రాలలో ఆర్థిక వృద్ధి వేగవంతం కావడమే కాకుండా, పారిశ్రామిక రంగానికి సైతం సరికొత్త ఊపు రానుందని కేంద్ర వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక


# ఉద్యోగి జీవితంలో పదవి విరమణ సహజం

## జిల్లా అటవీశాఖ అధికారిని బాలమణి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవి విరమణ సహజమని జిల్లా అటవీశాఖ అధికారిని బాలమణి అన్నారు. జిల్లా లోని కెరమెరి రేంజ్ పరిధిలో బీట్ అధికారిగా విధులు నిర్వహించిన యశ్వంత్ రావు పదవి విరమణ మహోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగ సమయంలో చేసిన సేవలు తదనంతరం గుర్తింపును తీసుకువస్తాయన్నారు. యశ్వంత్ రావు 30 సంవత్సరాల పాటు అటవీ శాఖకు సేవ చేయడం ఎంతో గుర్తించదగ్గదన్నారు. శేష జీవితం కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ రేంజ్ ల అధికారులు మజారుద్దీన్, రమాదేవి, జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు యోగేష్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# పూడిక తీత పనులను పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 17 వార్డులో బుధవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధాన డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పూడికను సిబ్బంది తొలగించారు. ఈ పనులను మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వర్షాకాలంలో అంటూ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకోకుండా మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపడుతున్నదని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే తమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.

# వైద్యున్ని సన్మానించిన అరిగెల



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** డాక్టర్స్ డే సందర్భంగా బుధవారం హైదరాబాద్ లోని మెడి విజన్ ఆసుపత్రి నేత్ర వైద్యుడు డాక్టర్ రవి కుమార్ ను భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరిగెల నాగేశ్వరావు శాలువాతో ఘనంగా సన్మానించి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అరిగెల మాట్లాడుతూ డాక్టర్ రవి కుమార్ నేత్ర పరీక్షలో మంచి నైపుణ్యం కలిగిన వైద్యులు అని అన్నారు. తమకు నెల రోజుల క్రితం కంటి ఆపరేషన్ చేశారని మంచి ఫలితం లభించిందన్నారు. త్వరలోనే ఆసిఫాబాద్ లో మెడి విజన్ ఆసుపత్రి ఆధ్వర్యలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తారన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# హనుమంతరావును పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావును ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ పరామర్శించారు. బుధవారం హైదరాబాద్లోని ఏఐజీ ఆసుపత్రిలో మర్యాదపూర్వకంగా కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం శేఖర్ తదితరులు కూడా పాల్గొని హనుమంతరావును పరామర్శించి ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంది

## జిల్లా కలెక్టర్ కె.హరిత




**ఉద్యమ కెరటం, కెరమెరి:** విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కెరమెరి మండలం అగర్వాడ గ్రామంలో గ్రామ సర్పంచ్ రోజా సోనాజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు అల్పాహారం, పోషకాలతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత పై చదువులకు గురుకుల పాఠశాలలకు పంపించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని తెలిపారు. ప్రతిరోజు విద్యార్థులు పాఠశాలకు హాజరై 100 శాతం హాజరు నమోదు చేసేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. గ్రామ సర్పంచ్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి గ్రామానికి వెళ్లే రహదారి, గ్రామంలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ నిర్మాణానికి, గ్రామంలో రేషన్ షాప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, సర్పంచ్ రోజా సోనాజీ, ఉపాధ్యాయులు, పంచాయితీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ కు వచ్చే ప్రజల సౌకర్యార్థం ఆర్.ఓ. ప్లాంట్ ప్రారంభం

## జిల్లా కలెక్టర్ కె.హరిత






**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల కొరకు శుద్ధ జలం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం కలెక్టరేట్ భవన సముదాయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనకాపూర్ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్. ఓ. ప్లాంట్ ను జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్ లతో కలిసి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం, ప్రజావాణి కొరకు కలెక్టరేట్ కు వచ్చే వందలాది మంది ప్రజల దాహార్తిని తీర్చేందుకు శుద్ధమైన త్రాగునీటిని అందించేలా ఆర్. ఓ. ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనకాపూర్ శాఖ వారు 2 లక్షల రూపాయల వ్యయంతో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తా రామ్ , బ్రాంచ్ మేనేజర్ జీవన్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలి

## జిల్లా వైద్యాధికారి సీతారాం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్యాధికారి సీతారాం అన్నారు. జిల్లా కార్యాలయంలో సిబ్బందితో కలిసి అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం లో భాగంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో గొప్పదన్నారు. దేవుడు మనిషికి జన్మనిస్తే వైద్యుడు పునర్జన్మను ఇస్తాడని గుర్తు చేశారు. అటువంటి వైద్య వృత్తిలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు నిబద్ధతతో ఉండాలన్నారు. జిల్లాలో అనేకమంది పేద మధ్యతరగతి రోగులు వైద్య నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని వారికి సరైన చికిత్స అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ఆసుపత్రిలో ఉన్న వసతులను సమతుల్యం చేసుకుంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా సిబ్బంది కృషి చేయాలన్నారు. జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి అంతర్జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ జిల్లా కోఆర్డినేటర్ శ్యామ్లాల్, సిహెచ్ఓలు వాసుదేవ్, మహాలక్ష్మి , ఎన్ సి డి కోఆర్డినేటర్ సంతోష్, డిప్యూటీ డెమో మార్త ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్‌లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

- పనులను పరిశీలించిన చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్**

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణంలో అంటువ్యాధులు ప్రబలకుండా, వర్షపు నీరు సజావుగా సాగిపోయేలా మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. బుధవారం పట్టణంలోని పలు కాలనీలలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్పర్సన్ ఆకాష్, వైస్ చైర్పర్సన్ ఎండి అహ్మద్, మున్సిపల్ కమిషనర్ అంజయ్యలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీల్లోని ప్రధాన డ్రైనేజీలలో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని, పూడికను జేసీబీ యంత్రాల సహాయంతో సిబ్బంది తొలగించారు. వర్షాలు పడినా నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలను ఎప్పటికప్పుడు క్లీన్ చేయిస్తున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ ఆకాష్ , వైస్ చైర్పర్సన్ ఎండి అహ్మద్ తెలిపారు. ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి సహకరించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు కోరారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశామని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే తమ ప్రాధాన్యత అని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది రామయ్య, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంకితభావంతో సేవలు అందించడం అభినందనీయం

## ఏసిఎంఓ పూర్కా ఉద్ధవ్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికీ పదవీ విరమణ తప్పనిసరి అని, అయితే విధుల్లో ఉన్నంత కాలం అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు పొందడం గొప్ప విషయమని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఏసిఎంఓ పూర్కా ఉద్ధవ్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం యపాల్‌పట్టి గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయులు కుమరం లచ్చు పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆయన స్వగృహంలో సన్మాన కార్యక్రమానికి ఏసిఎంఓ పూర్కా ఉద్ధవ్, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్ హాజరై, కుమరం లచ్చును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో కుమరం లచ్చు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. మృదుస్వభావి అయిన ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో సంతోషంగా సాగాలని ఆకాంక్షిస్తూ పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కోశాధికారి కుడ్మేత ఆనంత్, సోయం ఇంద్ర, కొమురం మాధవరావు, పెందూర్ భీంరావ్, ఆత్రం పెంటయ్య, చాహకటి శ్యాంరావ్, కొట్నాక్ రామకృష్ణ తదితర సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత సమాజం

- ఆసిఫాబాద్ డిఎస్పీ బీ. అశోక్ కుమార్



**ఉద్యమ కెరటం, జైనూర్ :** సిర్పూర్ (యు) పోలీస్ స్టేషన్‌లో జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాల సర్పంచ్లు, వ్యాపారులతో సీసీ కెమెరాల ఏర్పాటు, గంజాయి నిర్మూలన ,రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ ఎస్డీపీఓ బి. అశోక్ కుమార్ హాజరై మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో, వ్యాపార సముదాయాల్లో నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి సమాచారాన్ని పోలీసులకు అందించి నిర్మూలనకు సహకరించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ మరియు సీటుబెల్ట్ ధరించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్డీపీఓ సూచించారు. అనంతరం జైనూర్ సీఐ ఈ. రమేష్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతోనే నేర రహిత, సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు పోలీసు శాఖకు నిరంతరం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రవి కుమార్, కొమురయ్య, సురేష్ , తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణలో రాజకీయ పార్టీలు సహకరించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను సరైన సమాచారంతో నింపి తిరిగి ఫారాలను బూత్ స్థాయి అధికారులకు అందించే విధంగా ఆయా రాజకీయ పార్టీలు నియమించిన బూత్ స్థాయి ఏజెంట్లు క్షేత్రస్థాయిలో వెళ్లేలా రాజకీయ పార్టీలు దృష్టి సారించాలని తెలిపారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 94 శాతం పూర్తి అయ్యిందని, 11 వేల 310 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా 23 రోజుల గడువు మిగిలి ఉందని, ఓటరు వివరాలు నింపిన ఎన్యుమరేషన్ ఫారాలపై కలర్ ఫోటో అతికించి చరవాణి నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలని, నింపిన ఫారాన్ని బూత్ స్థాయి అధికారులకు అందించకపోతే ఓటును కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాన్ని నింపే పద్ధతిని వివరించడం జరిగిందని, లఘు చిత్రాలు కూడా అందించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తేజాపూర్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ



**ఉద్యమ కెరటం, బోథ్:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో బుధవారం తేజాపూర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. తేజాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్ బూత్ నం.268 వద్ద కొనసాగుతున్న సవరణ ప్రక్రియను పరిశీలించి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రతి ఓటర్ ఎన్యూమరేషన్ ఫారాన్ని నిశితంగా పరిశీలించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలు తీరుపై బూత్ లెవెల్ ఏజెంట్-2 (బీఎల్ఏ-2) గజ్జెల అశోక్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించేందుకు అధికారులు, ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ కమలాకర్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిరాం, జీపీఓ వినోద్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో అందరి భాగస్వామ్యం అవసరం

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేయడానికి అందరి భాగస్వామ్యం అవసరమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీలు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సవరించడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఇతర మార్పులు, చేర్పుల ప్రక్రియలో రాజకీయ పార్టీలు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్. చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, వైస్ చైర్మన్ రోహిత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, పట్టణ తహశీల్దార్ శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రను విరమించుకోవాలి

- **సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో**



**ఉద్యమ కెరటం, తాండూర్:** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రను వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజారామ్, వ్యవసాయ కార్మిక సంఘం తాండూర్ మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు బుధవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ సర్వీస్ రోడ్డుపై వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరును మార్చి కొత్త విధానాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాన్నే కొనసాగించాలని కోరారు. కొత్త విధానం అమల్లోకి వస్తే ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నష్టం జరిగే అవకాశముందని, ప్రస్తుతం అమలులో ఉన్న అనేక సంక్షేమ నిబంధనలు రద్దయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తన ఆర్థిక బాధ్యతను తగ్గించి రాష్ట్రాలపై అదనపు భారం మోపడం సరైన విధానం కాదన్నారు. కూలీలకు మెరుగైన వేతనాలు, హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని, సంక్షేమానికి భంగం కలిగించే నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గం నానయ్య, బొల్లం రాజేశం, జైనేని రాజయ్య, జైనేని భూమయ్య, స్వామి, రాంబాబు, సారయ్య, పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలి

- **వీబీజీ రామ్జీ బిల్లును వెంటనే రద్దు చేయాలని ప్రజా సంఘాల డిమాండ్**



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించి, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వీబీజీ రామ్జీ బిల్లును వెంటనే రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం కాగజ్నగర్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన ప్రదర్శన నిర్వహించి అనంతరం సబ్ కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2005లో అమలులోకి వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) గ్రామీణ పేదలకు ఉపాధి హక్కు కల్పించిన కీలక చట్టమని పేర్కొన్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి వంద రోజుల ఉపాధి కల్పిస్తూ కోట్లాది కార్మిక కుటుంబాలకు గత రెండు దశాబ్దాలుగా ఆర్థిక భరోసాగా నిలిచిందని తెలిపారు. ముఖ్యంగా కరోనా కాలంలో ఈ చట్టం గ్రామీణ కుటుంబాలకు జీవనాధారంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)–వీబీజీ రామ్జీ బిల్లు ఉపాధిహామీ చట్టాన్ని బలహీనపర్చే ప్రయత్నమని ఆరోపించారు. ఈ బిల్లు అమలులోకి వస్తే పనిదినాలు తగ్గడం, కేంద్ర నిధుల భారం రాష్ట్రాలపై పడడం, గ్రామీణ పేదల ఉపాధి హక్కుకు భంగం కలగడం, వలసలు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో 54 లక్షలకు పైగా జాబ్ కార్డులు, కోటి 20 లక్షలకు పైగా నమోదిత కార్మికులు ఈ చట్టం ద్వారా లబ్ధి పొందుతున్నారని, ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయలతో కోట్లాది పనిదినాలు కల్పిస్తున్నారని గుర్తు చేశారు. అలాగే 2023 ఎన్నికల సందర్భంగా పట్టణ పేదలకు 150 రోజుల ఉపాధి, రోజుకు రూ.400 వేతనం కల్పిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ఉపాధిహామీ చట్టాన్ని హక్కు చట్టం నుంచి సాధారణ పథకంగా మార్చే ప్రయత్నాలను ప్రజలు ఐక్యంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వీబీజీ రామ్జీ బిల్లును వెంటనే ఉపసంహరించుకుని ప్రస్తుత ఉపాధిహామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, జిల్లా నాయకులు బుడేకర్ రాజేందర్, వికలాంగుల జాతీయ వేదిక అధ్యక్షులు పందుగ రాజేష్ తదితరులు పాల్గొనగా, వీరికి కాంగ్రెస్ పార్టీ, ఎంఐఎం పార్టీ ప్రతినిధులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని వినతి**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా విద్యాధికారి, జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఇన్చార్జి డీఈఓ సదానందంకు బుధవారం కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా ఇన్చార్జి డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం గత ఏడాది నిర్ణయించిన మెను చార్జీలనే కొనసాగించడం ద్వారా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వంటకు అవసరమైన బియ్యం, కూరగాయలు, ఇతర సరుకులు, వంటగ్యాస్ను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులను అధికారికంగా కార్మికులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీస వేతన చట్టం పరిధిలోకి తీసుకురావాలని కోరారు. అలాగే ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ వంటి సంక్షేమ సౌకర్యాలు కల్పించి కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు తాళ్లూరు లక్ష్మి, ఉపాధ్యక్షురాలు షేక్ రహీమున్నీసా, జిల్లా కమిటీ సభ్యులు వెంకటమ్మ, సాయమ్మ, సత్యవతి, మంగమ్మ, పారేపల్లి సత్యవతి, లక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పశువులకు సోకే ప్రమాదకరమైన ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డిసీజ్) నివారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని ఈనెల 1 నుంచి ప్రారంభించినట్లు పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకొని తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. ఈ వ్యాధి కారణంగా పశువుల ఆరోగ్యం దెబ్బ తినడంతో పాటు పాల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున ముందస్తు రక్షణ చర్యగా టీకాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన టీకా కేంద్రాలకు రైతులు తమ ఆవులు, ఎద్దులను తీసుకువచ్చి ఉచితంగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఈ ప్రత్యేక టీకా కార్యక్రమంలో ప్రతి పాడి రైతు పాల్గొని తమ పశువులను వ్యాధి బారిన పడకుండా కాపాడాలని కోరారు.

# అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



**ఉద్యమ కెరటం, కెరమెరి:** అర్హులైన ప్రతిఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని రెవెన్యూ ఇన్స్పెక్టర్ జాదవ్ పవన్ నాయక్ సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బుధవారం కెరమెరి మండలంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన సవరణ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. బీఎల్ఓలు గ్రామాల్లో పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రతి ఓటర్ ఎన్యూమరేషన్ ఫారాన్ని నిశితంగా పరిశీలించి, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలు తీరును బూత్ లెవెల్ ఏజెంట్-2 ద్వారా అడిగి తెలుసుకున్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించేందుకు అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీపీఓ విశ్వాస్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు యూనిఫాంల పంపిణీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని కుమారి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు యూనిఫాంల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి, ప్యాక్స్ చైర్మన్ మందుల రమేష్ హాజరై అంగన్వాడీ చిన్నారులకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ప్రాథమిక విద్యా సౌకర్యాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల్లో విద్యపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. చిన్నతనం నుంచే నాణ్యమైన విద్యను అందించేందుకు అంగన్వాడీ టీచర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుమలత, భూతి అడేళ్లు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు కంది శ్రీనివాస రెడ్డి ఆర్థిక సాయం



**ఉద్యమ కెరటం, తాంసి:** మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన చినబాయి అనే మహిళ గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ బుధవారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, చినబాయి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం కంది శ్రీనివాస రెడ్డి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేసి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, మాజీ జెడ్పీటీసీ కొండా గంగాధర్, సింగిరెడ్డి రాంరెడ్డి, ఎల్మ రాంరెడ్డి, రతన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అరవింద్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నంది అవార్డు లు అందుకున్న అక్కా చెల్లె లు




**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండల కేంద్రానికి చెందిన అక్కా చెల్లె లు కాంద్ర సాయి తేజశ్రీ, మనుశ్రీ లు నృత్య ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబర్చి నంది అవార్డ్స్ అందుకున్నారు .రవీంద్ర భారతిలో జరిగిన అన్నమయ్య నంది అవార్డ్స్ 617 జయంతి సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ నంది అవార్డును ఎమ్మెల్సీ కోదండరాం చేతుల మీదుగా అందుకున్నారు. స్థానిక విద్యా భారతి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న తేజశ్రీ, 3వ తరగతి చదువుతున్న మనుశ్రీ కూచిపూడి నృత్యంలో పాల్గొని నంది అవార్డు సాధించుకొని తమ పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం పట్ల విద్యా భారతి పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్ చిన్నారులను అభినందించారు.

# ఘనంగా పోస్టల్ డే వేడుకలు

## లయన్స్ క్ల బ్ ఆధ్వర్యంలో తపాలా శాఖ ఉద్యోగులకు సన్మానం




**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోస్టల్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూర్ తపాలా శాఖ ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. తెలంగాణ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఠాకూర్ ఉమ్రావ్ సింగ్ మాట్లాడుతూ పోస్టల్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు రాత్రింబవళ్లు విశిష్ట సేవలు అందిస్తున్న పోస్టల్ ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లోనూ ఉత్తరాల పంపిణీతో ప్రారంభమైన తపాలా శాఖ తన సేవలను బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఈ-కామర్స్ వంటి పలు రంగాలకు విస్తరించి ప్రతి ఇంటికి నమ్మకమైన సేవలందిస్తోందని పేర్కొన్నారు. ఈ విజయాల వెనుక పోస్టల్ ఉద్యోగుల అంకితభావం, సేవా దృక్పథమే ప్రధాన కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లయన్స్ క్లబ్ కార్యదర్శి పి.సాంబమూర్తి, ఉపాధ్యక్షుడు ఎం.రాంచందర్, మాజీ అధ్యక్షుడు డి.రాజయ్య, క్ల బ్ సభ్యులు, తపాలా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# సీఎం సలహాదారుని కలిసిన మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తలమడుగు మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి రాజ్యసభ సభ్యుడు, ముఖ్యమంత్రి వ్యూహాత్మక సలహాదారు వేం నరేందర్ రెడ్డిని బుధవారం హైదరాబాద్లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని గోక గణేష్ రెడ్డికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి సలహాదారు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి నిరంతరం కృషి చేస్తానని గోక గణేష్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

# కలెక్టరేట్ పరిపాలన అధికారిగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారిగా దేశ్పాండే శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దేశ్పాండే శ్రీనివాసరావుకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకుముందు కలెక్టరేట్ పరిపాలన అధికారిగా విధులు నిర్వహించిన పిన్న రాజేశ్వర్ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో దేశ్పాండే శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు.

# సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల కు అందించి, పూరించిన తర్వాత సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అన్ని మండలాల తహసిల్దార్లు, సూపర్వైజర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా సంబంధిత ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం పంపిణీ చేయడం జరిగిందని, పూర్తి వివరాలతో ఫారం పూరించిన తర్వాత ఓటరు సంతకంతో కూడిన ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికారులు సేకరించి బి ఎల్ ఓ యాప్ లో డిజిటలైజ్ చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారం నింపడం, సేకరించడంలో బూత్ స్థాయి ఏజెంట్లు , పంచాయతీ కార్యదర్శులు, వి ఓ ఎ ల సహకారం తీసుకోవాలని తెలిపారు. సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలనీ, ఇంకా 23 రోజుల గడువు మిగిలి ఉందని తెలిపారు. ఓటరు తీసుకున్న ఎన్యుమరేషన్ ఫారం తిరిగి బూత్ స్థాయి అధికారులకు ఇవ్వకపోతే ఓటు గల్లంతయ్యే అవకాశం ఉందని, ఫారం తీసుకున్న ఓటరు తప్పనిసరిగా నింపి బూత్ స్థాయి అధికారులకు ఇచ్చే విధంగా గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సూపర్వైజర్లు, ఎన్నికల విభాగం అధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- సత్తుపల్లి వార్డు ల్లో పర్యటించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** సత్తుపల్లి పట్టణంలోని 13, 20వ వార్డుల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఇప్పటికే పూర్తయిన డ్రైనేజీ నిర్మాణ పనులు, సీసీ రోడ్లను పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిన డ్రైనేజీ, మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణ అభివృద్ధిలో పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. అనంతరం వేంసూర్ రోడ్డులోని కూరగాయల మార్కెట్ను సందర్శించి అక్కడి పారిశుధ్య పరిస్థితులు, మౌలిక వసతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వాన కోసం రైతన్న ఎదురుచూపులు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ఖరీఫ్ సాగు కాలం ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతన్న ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నాడు. ప్రతి ఏడాది జూన్ చివరి వారానికి నారుమడులు సిద్ధం చేసి వరి నాట్లకు సన్నాహాలు చేసే రైతులు, ఈసారి మాత్రం వర్షాభావంతో పొలాల్లోకి అడుగు పెట్టలేక ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి సాగుకు సిద్ధమైన రైతులు వర్షం కోసం నిరీక్షిస్తున్నారు. వర్షాలు లేకపోవడంతో నారు పోసే పరిస్థితి కనిపించకపోవడం రైతుల్లో తీవ్ర నిరాశ కలిగిస్తోంది. బోర్లు, చెరువులు, కాలువల్లో నీటి లభ్యత కూడా తక్కువగా ఉండటంతో సాగు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షాలు ఆలస్యమైతే వరి సాగు మాత్రమే కాకుండా మొక్కజొన్న, పత్తి, మిర్చి, వంటి ఖరీఫ్ పంటల సాగుపైనా ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగు కోసం అప్పులు చేసి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు ప్రతిరోజు గడిచేకొద్దీ ఆర్థిక భారం పెరుగుతోంది. ఇదిలా ఉండగా, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన ఎరువులు, నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఎలాంటి కొరత లేకుండా ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయడంతో పాటు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు కూడా అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వ్యవసాయ నిపుణులు మాత్రం రైతులు వాతావరణ పరిస్థితులను గమనించి, అధికారుల సూచనల మేరకు సాగు పనులు ప్రారంభించాలని సూచిస్తున్నారు. తగినంత వర్షపాతం నమోదైన తర్వాతే నారు పోయడం, విత్తనాలు వేయడం మంచిదని చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో రైతుల నోట ఒకటే మాట వినిపిస్తోంది... "వాన పడితేనే నారు-నారు పోస్తేనే పంట" పంట పండితేనే రైతు బతుకు." సకాలంలో మంచి వర్షాలు కురిసి, వ్యవసాయ శాఖ అవసరమైన విత్తనాలు, ఎరువులను సమయానికి అందించి రైతులకు అండగా నిలవాలని అన్నదాతలు కోరుతున్నారు.



# అంగన్వాడీ టీచర్ను వేధించి రూ.50 వేలు డిమాండ్

- ప్రభుత్వ ఉపాధ్యాయుడు అరెస్ట్.. రిమాండ్కు తరలింపు




**ఉద్యమ కెరటం, బోథ్:** అంగన్వాడీ టీచర్ను ఉద్యోగపరంగా వేధిస్తూ, ఆర్టీఐ చట్టం పేరుతో బెదిరించి రూ.50వేల నగదు డిమాండ్ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. బోథ్ సీఐ డి.గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండలంలో విధులు నిర్వహిస్తున్న సొనాల మండలం ఘన్పూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాథోడ్ రాజు, అదే గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ రాథోడ్ విమలను కొంత కాలంగా ఉద్యోగపరంగా వేధిస్తున్నాడు. ఆర్టీఐ చట్టం ద్వారా ఆమె వ్యక్తిగత, ఉద్యోగ సంబంధిత వివరాలు సేకరించి ఉద్యోగం పోయేలా చేస్తానని బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలా చేయకుండా ఉండాలంటే రూ.50 వేల నగదు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని బాధితురాలు కుటుంబ సభ్యులకు తెలియజేయగా, ఆమె కుమారుడు శ్రీనివాస్ బోథ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు రాథోడ్ రాజును అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ అధికారాన్ని, చట్టాలను దుర్వినియోగం చేసి ప్రజలను బెదిరించడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి వ్యవహారాల్లో ఎవరైనా బాధితులై ఉంటే జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు.

# రోడ్డు భద్రత నియమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో డీసీపీ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్ల ంపల్లిసబ్ కలెక్టర్ మనోజ్తో కలిసి పోలీసు, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు-భవనాలు, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత ఆరు నెలలుగా 'అరైవ్-అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో 253 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, 75 మంది మృతి చెందినట్లు చెప్పారు. మున్సిపల్ లోని అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, రహదారి భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారులపై చెత్త, అడ్డంకులను వెంటనే తొలగించాలని, అనధికార వాహన పార్కింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్ల ంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. తక్కువ వెలుతురు ఉన్న ప్రాంతాల్లో వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో పాటు జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓవర్లోడింగ్, అతివేగం, ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులపై రవాణా శాఖ కఠిన చర్యలు కొనసాగించాలని తెలిపారు. జూన్ నెలలో జిల్లాలో 66 ఓవర్లోడ్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా కఠినంగా వ్యవహరించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్సులను నిబంధనల ప్రకారం రద్దు చేయాలని ఆదేశించారు. ఓవర్లోడింగ్, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడంపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నిబంధనలు ఉల్ల ఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. డ్రగ్స్ రహిత మంచిర్యాల లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ ఏడాది ఇప్పటివరకు 22 కేసులు నమోదు చేసి 62 మందిని అరెస్టు చేయడంతో పాటు 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగదారులను గుర్తించి కోర్టు ఆదేశాలతో డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సిలింగ్ అందిస్తున్నామని తెలిపారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రతినెల అవగాహన కార్యక్రమాలు, క్విజ్, డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికే మూసివేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు బెల్ట్ షాపులను నియంత్రించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు , సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థుల ఆరోగ్యమే ఉజ్వల భవిష్యత్తుకు పునాది

- 'ఆరోగ్య పాఠశాల' మూడో విడత కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోగలరని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ గార్డెన్లో నిర్వహించిన 'ఆరోగ్య పాఠశాల' మూడో విడత జిల్లా స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య పాఠశాల బుక్లెట్తో పాటు పోక్సో చట్టం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆరోగ్యం మూలాధారమని పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, శారీరక వ్యాయామం, యోగా, క్రీడలు, జీవన నైపుణ్యాలపై నిరంతర అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటు చేసి తాజా ఆకుకూరలు, కూరగాయల వినియోగాన్ని ప్రోత్సహించాలని, ఎంపీడీఓలు, ఏపీఓలు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో అందుబాటులో ఉన్న నిధులను వినియోగించాలని ఆదేశించారు. యుక్తవయస్సులో విద్యార్థులకు ఎదురయ్యే శారీరక, మానసిక మార్పులపై శాస్త్రీయ అవగాహన కల్పించాలని, ముఖ్యంగా బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, రుతుక్రమ నిర్వహణ, పోషకాహారం, రక్తహీనత నివారణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ప్రతి శనివారం వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఇంగ్లీష్ ప్రావీణ్యంపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. కేజీబీవీల్లో విద్యార్థుల నమోదును 30 శాతం పెంచి, హాజరు శాతాన్ని 90 శాతానికి చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేసి పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించిన పాఠశాలలకు ప్రత్యేక అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని ప్రకటించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచడంలో కృషి చేసిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. బాసర ఐఐఐటీలో సీట్లు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను కూడా అభినందించి సత్కరించారు. అంతకుముందు డాక్టర్స్ డే సందర్భంగా వైద్యశాఖ అధికారులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఈఓ మాధవి, డీఐఈఓ గణేష్ జాదవ్, జెడ్పీ సీఈఓ రవి, డీఆర్డీఓ రవీందర్, డీపీఓ రమేష్, డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, డబ్ల్యూఓ మిల్కా, ఆర్టీసీ డీఎం సాయన్న, ఆరోగ్య పాఠశాల కోఆర్డినేటర్ అజయ్, ఎంపీడీఓలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ధాన్యం లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాములు**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము నుంచి ధాన్యం లోడింగ్, పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి రేషన్ డీలర్లకు సకాలంలో సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం నస్పూర్ మండలం తీగల్పహాడ్లో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ గోదామును పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో ధాన్యం నిల్వలు, లోడింగ్, పంపిణీ ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాము నుంచి ధాన్యం తరలింపులో ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా లోడింగ్ చేపట్టాలని సూచించారు. ధాన్యం వీలైనంత త్వరగా రేషన్ డీలర్లకు చేరేలా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సరఫరాలో ఆలస్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా స్టేజ్–2 గుత్తేదారు, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



**ఉద్యమ కెరటం, జైనూర్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో గిరిజన ప్రాంతాల ప్రజల ఓటు హక్కు పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ మెస్రం రాహుల్ కోరారు. బుధవారం జైనూర్ మండల కేంద్రంలో ఆదివాసి నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సర్వేలో భాగంగా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అయితే ఆ ఫారాలను ప్రజలే స్వయంగా నింపాలని సూచించడంతో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అన్నారు. కొమరంభీం జిల్లా ప్రధానంగా గిరిజన ప్రాంతమని, ఇక్కడ అధిక సంఖ్యలో నిరక్షరాస్య ఆదివాసీలు నివసిస్తున్నారని పేర్కొన్నారు. ఫారాలు పూరించే సమయంలో పొరపాట్లు జరిగితే అర్హులైన వారు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియ, ఫారాల పూరింపుపై గ్రామీణ ప్రజలకు తగిన అవగాహన లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి గ్రామంలో బీఎల్ఓలే ప్రతి కుటుంబాన్ని సందర్శించి స్వయంగా ఫారాలను పూర్తి చేసేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలతోనే ఫారాలు నింపించడం ద్వారా ముఖ్యంగా ఆదివాసీలకు అన్యాయం జరిగే పరిస్థితి రాకుండా చూడాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఓటు హక్కు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆత్రం జగదీరావు, మడవి హన్ను, మడవి కొద్దు పటేల్, స్వామి, సచిన్, గెడం లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమవంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు. బుధవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా చేపడుతున్నామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రజలకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్నారని, ఫారాలను సక్రమంగా పూరించిన అనంతరం వాటిని సేకరించి బీఎల్ఓ యాప్లో డిజిటలైజ్ చేస్తున్నట్లు వివరించారు. ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాలను సరైన వివరాలతో నింపడంలో రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి ఫారాలు పూరించేందుకు అవసరమైన సహాయం అందించాలని కోరారు. జూలై 24 వరకు గడువు ఉన్నందున ఆలోపు ఫారాలు సమర్పించని వారు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. వాలంటీర్లు, యువత, బూత్ స్థాయి ఏజెంట్లు ప్రజలకు సహకరించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, 2002 సంవత్సరం నాటి ఓటరు వివరాలతో కుటుంబ సభ్యుల అనుసంధానం చేస్తూ ప్రత్యేక సమగ్ర సవరణ చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 72 శాతం అనుసంధాన ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ డబుల్, షిఫ్టెడ్, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం కోసం వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్సీసీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**ఉద్యమ కెరటం, సిరికొండ:** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సిరికొండ మండలంలోని వైపేట్ గ్రామ పంచాయతీ 49వ పోలింగ్ బూత్లో ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ పటేల్, మండల అధ్యక్షుడు కంచెం లక్ష్మణ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓ, వైపేట్ బీఎల్ఏ పెందూర్ బదిరావుతో కలిసి ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. అనంతరం 51వ పోలింగ్ బూత్ పరిధిలోని ఫకీర్ నాయక్ తండాలో పర్యటించి, ఓటర్ల నమోదు ఫారాలను ఎలా పూరించాలో గ్రామస్తులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ పటేల్, మండల అధ్యక్షుడు కంచెం లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన హక్కు అని, అర్హులైన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో తమ వివరాలను సరిచూసుకుని తప్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ చవాన్ ప్రకాష్, ఆడే సతీశ్, మండల మాజీ అధ్యక్షుడు షేక్ ఇమామ్, కిసాన్ పటేల్, శ్యామ్ జాదవ్, గ్రామ సర్పంచ్ చిక్రం రాము, గంగాసాగర్, గ్రామ పటేల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మీ సేవ ఆపరేటర్లకు యూడీఐడీ నమోదుపై శిక్షణ



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలోని మీ సేవ ఆపరేటర్లకు సదరం, యూడీఐడీ పోర్టల్లో వివరాల నమోదు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తుల నమోదు విధానంపై ప్రత్యేక శిక్షణ అందించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య తెలిపారు. బుధవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 133 మంది మీ సేవ ఆపరేటర్లకు యూడీఐడీ, సదరం పోర్టల్లో 20 రకాల దివ్యాంగత్వాలకు సంబంధించిన నమోదు ప్రక్రియతో పాటు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తుల ఆన్లైన్ నమోదు విధానంపై సమగ్ర శిక్షణ అందించినట్లు చెప్పారు. వివరాల నమోదు సమయంలో పాటించాల్సిన నియమనిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారని పేర్కొన్నారు. అలాగే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అర్హతలు, విధివిధానాలు, దరఖాస్తుల ఆన్లైన్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూడీఐడీ పర్యవేక్షకులు శ్రీధర్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్య, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, డీపీఎం అన్నాజీ, ఏపీఎం రాజ్కుమార్, సంబంధిత అధికారులు, మీ సేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం




**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** 2026 సంవత్సరానికి గాను అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం స్ప్రింగ్ ఇంటెక్కు అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి ఆన్లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఎంపికైన విద్యార్థులకు రూ.20లక్షల వరకు ఉపకార వేతనం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూజిలాండ్ దేశాల్లోని విశ్వ విద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించాలనుకునే ఎస్సీ విద్యార్థులు ఈనెల 1 నుంచి ఆగస్టు 31 వరకు www.telangana.epass.cgg.gov.in వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు జిల్లావాసులై షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారై ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించరాదని తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు గ్రాడ్యుయేషన్లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. పాస్పోర్ట్, వీసాతో పాటు విదేశీ విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ పొంది ఉండాలని, ఒక కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

- రైతు భరోసా నిధుల విడుదలతో హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు



**ఉద్యమ కెరటం, బేల:** మండలంలోని సాంగిడి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, రైతులు బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి మాట్లాడుతూ రైతుభరోసా పథకంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు అండగా నిలుస్తూ రైతు భరోసా నిధులను వారి ఖాతాల్లో జమ చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వినోద్, సతీష్, బేల మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ జితేందర్, నర్సారెడ్డి, ప్రకాష్, రవీందర్, సునీల్, రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుంచే ఇంగ్లండ్‌తో పోరు

- పుంజుకోవాలని భారత్
- చెస్టర్-లీ-స్ట్రీట్‌లో రాత్రి 10 గంటలకు తొలి టీ20
- ఐదు టీ20లు, మూడు వన్డేల్లో భారత్--ఇంగ్లండ్ పోటీ
- వైభవ్ అరంగేట్రంపై అభిమానుల్లో ఆసక్తి
- సోనీ స్పోర్ట్స్, సోనీ లివ్‌లో ప్రత్యక్ష ప్రసారం

**న్యూఢిల్లీ, జులై 1:** ఐర్లాండ్ చేతిలో టీ20 సిరీస్‌ను 0-2తో కోల్పోయిన భారత జట్టు.. ఇప్పుడు ఇంగ్లండ్ పర్యటనలో విజయాలతో పుంజుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇరు జట్ల మధ్య నేటి నుంచి ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. తొలి టీ20 మ్యాచ్ చెస్టర్-లీ-స్ట్రీట్‌లోని రివర్‌సైడ్ గ్రౌండ్‌లో భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు ప్రారంభమవుతుంది. టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తుండగా, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి అరంగేట్రం దక్కుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మరోవైపు బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ అనంతరం హ్యారీ బ్రూక్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న ఇంగ్లండ్ జట్టు స్వదేశంలో సిరీస్‌ను సొంతం చేసుకోవాలని పట్టుదలగా ఉంది.



### ఇంగ్లండ్ జట్టు

హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్, టామ్ బాంటన్, జోర్డాన్ కాక్స్, జాకబ్ బెతెల్, జేమ్స్ కోల్స్, సామ్ కరన్, లియామ్ డాసన్, విల్ జాక్స్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, సోనీ బేకర్, సాకిబ్ మహ్మూద్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్, ల్యూక్ వుడ్.

### ప్రత్యక్ష ప్రసారం ఎక్కడ?

భారత్-ఇంగ్లండ్ టీ20, వన్డే సిరీస్‌ల ప్రత్యక్ష ప్రసార హక్కులు సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ కు ఉన్నాయి. టెలివిజన్‌లో సోనీ స్పోర్ట్స్ ఛానళ్లలో మ్యాచ్‌లను వీక్షించవచ్చు. అలాగే సోనీ లివ్ యాప్‌లో అన్ని మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి.

## భారత్-ఇంగ్లండ్ 2026 పూర్తి షెడ్యూల్

### టీ20 సిరీస్

**జులై 1:** తొలి టీ20 - రివర్‌సైడ్ గ్రౌండ్, చెస్టర్-లీ-స్ట్రీట్ (రాత్రి 10:00IST)

**జులై 4:** రెండో టీ20 - ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్, మాంచెస్టర్ (సాయంత్రం 7:00 IST)

**జులై 7:** మూడో టీ20 - ట్రెంట్ బ్రిడ్జ్, నాటింగ్‌హామ్ (రాత్రి 10:00 IST)

**జులై 9:** నాలుగో టీ20 - సీట్ యూనిక్ స్టేడియం, బ్రిస్టల్ (రాత్రి 10:00 IST)

**జులై 11:** ఐదో టీ20 - యుటిలిటా బౌల్, సౌతాంప్టన్ (సాయంత్రం 7:00 IST)

### వన్డే సిరీస్:

**జులై 14:** తొలి వన్డే - ఎడ్జ్‌బాస్టన్, బర్మింగ్‌హామ్ (సాయంత్రం 5:30 IST)

**జులై 16:** జూలై 16: రెండో వన్డే - సోఫియా గార్డెన్స్, కార్డిఫ్ (సాయంత్రం 5:30 IST)

**జులై 19:** మూడో వన్డే - లార్డ్స్, లండన్ (మధ్యాహ్నం 3:30 IST)

### భారత్ జట్లు

**టీ20 జట్టు:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ.

**వన్డే జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్.



# 40 ఏళ్ల తర్వాత మెక్సికో చరిత్ర

## రౌండ్ ఆఫ్ 16లోకి ఘనంగా అడుగు

**మెక్సికో సిటీ, జులై 1:** ఫిఫా ప్రపంచకప్ 2026లో సహ ఆతిథ్య దేశమైన మెక్సికో రౌండ్ ఆఫ్ 16లోకి ఘనంగా ప్రవేశించింది. రౌండ్ ఆఫ్ 32లో ఈక్వెడార్‌పై 2-0 గోల్స్ తేడాతో విజయం సాధించి నాకౌట్ దశలో నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెరదించింది. మ్యాచ్ తొలి అర్ధభాగంలోనే మెక్సికో రెండు గోల్స్ నమోదు చేసి ఆధిపత్యం చాటింది. 22వ నిమిషంలో జులియన్ క్వినోనిస్ తొలి గోల్ చేయగా, 31వ నిమిషంలో రౌల్ జిమెనెజ్ మరో గోల్ సాధించి జట్టుకు 2-0 ఆధిక్యం అందించాడు. అనంతరం ఈ ఆధిక్యాన్ని చివరి వరకు కాపాడుకున్న మెక్సికో సునాయాస విజయాన్ని నమోదు చేసింది. 1986 ప్రపంచకప్‌లో బల్గేరియాపై నాకౌట్ దశలో గెలిచిన తర్వాత తొలిసారి మెక్సికో ఈ దశలో విజయం సాధించింది. గత ఏడు ప్రపంచకప్‌లలో వరుసగా నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓడిన మెక్సికోకు ఈ విజయం చారిత్రకంగా నిలిచింది. ఈ టోర్నీలో జులియన్ క్వినోనిస్‌కు ఇది మూడో గోల్ కావడం విశేషం. స్వదేశీ అభిమానుల మద్దతుతో జోరుమీదున్న మెక్సికో ఇప్పుడు క్వార్టర్ ఫైనల్ బెర్త్ కోసం రౌండ్ ఆఫ్ 16లో మరో కీలక పోరుకు సిద్ధమవుతోంది.

# ఒక్కో పరుగుకు రూ.14 వేలు

- వైభవ్ బ్రాండ్ విలువకు రెక్కలు
- 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు.. ఆరెంజ్ క్యాప్‌తో సంచలనం
- ఎండార్స్‌మెంట్ ఫీజు రూ.2 కోట్ల వరకు పెరుగుదల
- మైనర్ కావడంతో భారీ బ్రాండ్లకు చట్టపరమైన అడ్డంకులు



**న్యూఢిల్లీ, జులై 1:** భారత క్రికెట్‌లో కొత్త సంచలనంగా మారిన 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో ఆటతో పాటు తన బ్రాండ్ విలువను కూడా అమాంతం పెంచుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఈ సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్‌తో పాటు 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' అవార్డును సొంతం చేసుకున్న వైభవ్, ప్రస్తుతం మార్కెట్లో అత్యంత డిమాండ్ ఉన్న యువ క్రీడాకారుడిగా నిలిచాడు. ఐపీఎల్ కాంట్రాక్ట్ ద్వారా ఏడాదికి రూ.1.10 కోట్లు అందుకుంటున్న వైభవ్ చేసిన పరుగుల లెక్కన చూస్తే ఒక్కో పరుగుకు దాదాపు రూ.14 వేల ఆదాయం లభిస్తున్నట్లు అంచనా. ఈ ప్రదర్శన తర్వాత అతని బ్రాండ్ విలువ కూడా భారీగా పెరిగింది. ప్రస్తుతం ఒక్కో ప్రకటన ఒప్పందానికి రూ.50 లక్షల నుంచి రూ.1.5--2 కోట్ల వరకు పారితోషికం అందుకుంటున్నట్లు సమాచారం. అయితే వైభవ్ వయసు కేవలం 15 సంవత్సరాలు కావడంతో పలు ప్రముఖ ఆటోమొబైల్, లైఫ్‌స్టైల్ బ్రాండ్లు అతనితో ఒప్పందాలు చేసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నాయి. భారత చట్టాల ప్రకారం 18 ఏళ్లు నిండకపోతే డ్రైవింగ్ లైసెన్స్ పొందడం సాధ్యం కాదు. దీంతో వాహనాల ప్రకటనల్లో అతన్ని చూపించడం చట్టపరంగా ఇబ్బందులకు దారితీసే అవకాశం ఉందని కంపెనీలు భావిస్తున్నాయి. అలాగే పెద్దల కోసం ఉద్దేశించిన గ్రూమింగ్ ఉత్పత్తులు, లగ్జరీ వస్తువులు, ఫాంటసీ గేమింగ్, ఆర్థిక సేవలకు సంబంధించిన ప్రకటనల్లో కూడా మైనర్లను ఉపయోగించడంపై పరిమితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బ్రాండ్లు కూడా తమ వ్యూహాన్ని మార్చుకున్నాయి. గతంలో మాదిరిగా దీర్ఘకాలిక ఒప్పందాల కంటే ప్రస్తుతం రెండేళ్ల నుంచి మూడేళ్ల స్వల్పకాలిక ఒప్పందాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. అయితే స్పోర్ట్స్ డ్రింక్స్, క్రికెట్ సామగ్రి, న్యూట్రిషన్ ఉత్పత్తులు, స్పోర్ట్స్ షూ బ్రాండ్లు మాత్రం వైభవ్‌తో ఒప్పందాలకు ఆసక్తి చూపుతున్నాయి. మరోవైపు అతని కుటుంబం, రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం అతన్ని అధిక వాణిజ్య ప్రచారాలకు దూరంగా ఉంచుతూ, వయసుకు తగిన బ్రాండ్లను మాత్రమే ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ అంచనా ఆస్తి విలువ సుమారు రూ.3 కోట్లుగా భావిస్తున్నారు. త్వరలో భారత జట్టులో స్థానం దక్కితే బీసీసీఐ వార్షిక ఒప్పందం ద్వారా అతని ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో రానున్న రోజుల్లో భారత క్రికెట్‌లోనే అత్యధిక బ్రాండ్ విలువ కలిగిన యువ ఆటగాళ్లలో వైభవ్ ఒకరిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# హార్దిక్ కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీల పోటీ

## ట్రేడ్ రేసులో సీఎస్‌కే, కేకేఆర్ ముందంజ

**ముంబై, జులై 1:** ఐపీఎల్ 2026 సీజన్‌లో నిరాశాజనక ప్రదర్శన తర్వాత ముంబై ఇండియన్స్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఫ్రాంచైజీని వీడేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో అతడిని దక్కించుకునేందుకు పలు ఐపీఎల్ ఫ్రాంచైజీల మధ్య ట్రేడ్ పోటీ నెలకొంది. సమాచారం ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మినహా మిగిలిన పలు ఫ్రాంచైజీలు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ ట్రేడ్ రేసులో ముందున్నట్లు తెలుస్తోంది. ఎంఎస్ ధోనీ తర్వాత జట్టుకు అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ అవసరమని భావిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్ హార్దిక్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు కోల్‌కతా నైట్ రైడర్స్ హార్దిక్‌కు నేరుగా కెప్టెన్సీ బాధ్యతలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రాజస్థాన్ రాయల్స్ కూడా దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా అతడిని తమ జట్టులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య అంతర్గత చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. అయితే ఈ ట్రేడ్‌పై ఇప్పటివరకు ఏ ఫ్రాంచైజీ కూడా అధికారిక ప్రకటన చేయలేదు. ట్రేడ్ పూర్తిగా నగదు రూపంలో జరుగుతుందా లేదా ఆటగాళ్ల మార్పిడి రూపంలో ఉంటుందా అనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఆటగాడి అంగీకారంతో పాటు ఫ్రాంచైజీల మధ్య ఒప్పందం కుదిరిన తర్వాతే ట్రేడ్ అధికారికంగా ఖరారుకానుంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై క్రికెట్ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.



# వింబుల్డన్ సింగిల్స్‌లో ఓడిన సెరీనా విలియమ్స్




**లండన్:** 44 ఏళ్ల వయసులో సెరీనా విలియమ్స్.. వింబుల్డన్‌లో రీ-ఎంట్రీ ఇచ్చింది. వైల్డ్‌కార్డు ఎంట్రీతో టోర్నీలో ఆడిన మాజీ చాంపియన్.. మంగళవారం తొలి రౌండ్‌లోనే ఓటమి చవిచూసింది. 23 గ్రాండ్ స్లామ్ టోర్నీలు గెలిచిన సెరీనా.. తొలి రౌండ్‌లో 20 ఏళ్ల ఆస్ట్రేలియా ప్లేయర్ మాయా జాయింట్ చేతిలో 6-3, 6-7 (6), 6-3 స్కోరు తేడాతో పరాజయాన్ని చవిచూసింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత మళ్లీ వింబుల్డన్‌లో సెరీనా అడుగుపెట్టింది. ఏదైనా అద్భుతం చేస్తుందో ఏమో అని ఆమె అభిమానాలు ఎదురుచూశారు. భర్త , ఇద్దరు పిల్లలు కూడా ఆ మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చారు. కానీ అనూహ్య రీతిలో సింగిల్స్ మ్యాచ్‌లో సెరీనా విలియమ్స్ ఇంటి దారి పట్టాల్సి వచ్చింది. తన కన్నా సగం వయసున్న ఆస్ట్రేలియా ప్లేయర్ మాయాతో కొంత వరకు ధీటుగానే పోరాడింది. సర్వీసును దాదాపు 129 మీటర్ల వేగంతో కొట్టింది. గ్రౌండ్ స్ట్రోక్స్ కూడా సెరీనా బాగానే ఆడింది. కానీ ప్రత్యర్థి మాయా.. సెరీనాను పరుగెత్తించింది. వింబుల్డన్‌లో మళ్లీ ఆడడం ఆనందంగా ఉందని, మళ్లీ వస్తానా రానో అనుకున్నట్లు చెప్పింది. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత మీడియాతో సెరీనా మీటింగ్ కాలేదని వింబుల్డన్ నిర్వాహకులు తెలిపారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
గురువారం
2 జూలై 2026



## కాగితం పడవలు బృందానికి చిరు అభినందనలు



కర్ణాటక రాష్ట్రంలోని చింతామణిలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ, కాలక్రమేణా ఒక చిత్ర నిర్మాతగా మారిన మెగా అభిమాని అంజనప్ప , 45 మంది తన స్నేహితులు, 'కాగితం పడవలు' చిత్రబృందంతో కలిసి చిరంజీవి పై ఉన్న అభిమానంతో, వందల కిలోమీటర్లు ప్రయాణించి మరీ హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేశారు. 'రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి' అని మెగాస్టార్ చిరంజీవి ఇచ్చిన పిలుపును గుండెల్లో నింపుకుని, లక్షలాది మంది ప్రాణాలను కాపాడటంలో మెగాభిమానులు ఎప్పుడూ ముందుంటారని మరోసారి వారంతా నిరూపించారు. ఈ విషయం చిరంజీవి వరకు చేరడంతో ఆయన చాలా హ్యాపీగా ఫీలయ్యారు. విశేషం ఏంటంటే.. అంజనప్ప ఇంతవరకు చిరంజీవిని నేరుగా కలవలేదు. కేవలం చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి తన బాధ్యతగా తన చిత్ర బృందంతో కలిసి రక్తదానం చేసి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న చిరంజీవి.. సినిమా షూటింగ్, ఇతర సామాజిక కార్యక్రమాలతో తీరిక లేకుండా ఉన్నప్పటికీ.. అంజనప్ప అండ్ టీమ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ స్వయంగా ఒక లెటర్ పంపించారు. ప్రియమైన అంజనప్ప, గాయత్రమ్మ.. ఇంకా 'కాగితం పడవలు' చిత్రయూనిట్ సభ్యులకు.. మానవత్వాన్ని పరిమళింపజేస్తూ, సమాజం పట్ల మీ బాధ్యతను చాటుతూ మీరు చేపట్టిన రక్తదాన సేవా కార్యక్రమానికి నా హృదయపూర్వక అభినందనలు. ఈరోజు చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో 'కాగితం పడవలు' చిత్రయూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మొత్తం 23 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. వైద్య కారణాల వల్ల రక్తదానం చేయలేకపోయిన వారు, ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో రావడం కూడా ప్రశంసనీయం.

## కత్రినా కైఫ్ ప్రస్థానం

బాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా గుర్తింపు పొందిన కత్రినా కైఫ్ తన ప్రతిభతో సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. చదువు కంటే నటనపై ఆసక్తి పెంచుకున్న ఆమె, కష్టపడి స్టార్ హీరోయిన్‌గా ఎదిగి కోట్లాది మంది అభిమానులను సంపాదించారు. ప్రస్తుతం అత్యధిక పారితోషికం అందుకునే నటీమణుల్లో ఆమె ఒకరిగా నిలిచారు. తెలుగు ప్రేక్షకులకు కూడా కత్రినా కైఫ్ సుపరిచితమే. వెంకటేష్ కథానాయకుడిగా నటించిన 'మల్లీశ్వరి' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమె తొలి చిత్రంతోనే మంచి విజయాన్ని అందుకున్నారు. అనంతరం బాలకృష్ణ సరసన 'అల్లరి పిడుగు' చిత్రంలో నటించారు. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో తిరిగి బాలీవుడ్‌పై దృష్టి సారించారు. హిందీ చిత్రసీమలో వరుస విజయాలతో అగ్ర కథానాయికగా ఎదిగిన కత్రినా, ప్రముఖ హీరో విక్కీ కౌశల్‌ను వివాహం చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించారు. వివాహం అనంతరం కూడా ఎంపిక చేసిన చిత్రాల్లో నటిస్తూ సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను పదో తరగతి పూర్తి చేయలేదని కత్రినా వెల్లడించారు. అయినప్పటికీ తన ప్రతిభతో ఒక్కో చిత్రానికి సుమారు రూ.25 కోట్ల వరకు పారితోషికం అందుకునే స్థాయికి చేరుకున్నారు. ఆమె ఆస్తుల విలువ రూ.200 కోట్లకు పైగానే ఉంటుందని సినీ వర్గాల అంచనా. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉంటూ అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారు.

## ఆల్ఫా సెన్సార్ పూర్తి.. 3న విడుదల



శివ్ రావైల్ దర్శకత్వంలో, అలియా భట్, శర్వరి ప్రధాన పాత్రలు పోషిస్తున్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. జులై 3న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా తాజాగా సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఇప్పటికే యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సినిమాలో కొన్ని మార్పులు చేయాలని కోరింది. ద్వితీయార్ధంలో వచ్చే కొన్ని సన్నివేశాల తీవ్రతను తగ్గించి, ప్రత్యామ్నాయ దృశ్యాలను పెట్టాలని సూచించింది. ప్రథమార్ధంలోని ఓ డైలాగ్‌ను తొలగించి, మరో రెండు సంఘటనల విజువల్స్‌ను తగ్గించాలని ఆదేశించింది. మద్యం తీసుకునే సన్నివేశాల్లో గమనిక వేయాలని, మూవీలోని అన్ని పాటలకూ సబ్‌టైటిల్స్ జోడించాలని కోరింది. సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ కోసం వారి తల్లిదండ్రుల నుంచి అనుమతి లేఖను సమర్పించాలని ఆదేశించింది. తాజాగా ఆల్ఫా ఈ పనులన్నీ పూర్తి చేసుకుంది. ఈ భారీ యాక్షన్ సినిమా నిడివి 2 గంటల 20 నిమిషాల 48 సెకన్లు. ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ మూవీలో బాబీ దియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తుండగా, హృతిక్ రోషన్ అతిథి పాత్రలో కనిపించనున్నారు.



## యషికా ఆనంద్ సినీ ప్రయాణం

తమిళ సినీ పరిశ్రమలో గ్లామరస్ పాత్రలు, ప్రత్యేకమైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న నటి యషికా ఆనంద్ సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, తక్కువ సమయంలోనే కథానాయికగా ఎదిగి తమిళ ప్రేక్షకుల్లో మంచి ఆదరణను సంపాదించారు. సినిమాలతో పాటు రియాలిటీ షోల ద్వారా కూడా ఆమెకు ప్రత్యేక అభిమాన వర్గం ఏర్పడింది. 1999 ఆగస్టు 4న న్యూఢిల్లీలో జన్మించిన యషికా ఆనంద్ అనంతరం చెన్నైలో స్థిరపడ్డారు. 2016లో విడుదలైన 'ధురువంగల్ పత్తినారు' చిత్రంతో సినీరంగంలో అడుగుపెట్టిన ఆమె, సహాయ పాత్రలో నటించినప్పటికీ తన నటనతో గుర్తింపు పొందారు. 2018లో విడుదలైన 'ఇరుట్టు అరైయిల్ మురట్టు కుత్తు' చిత్రంలో పోషించిన పాత్రతో యషికా ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. అదే ఏడాది ప్రసారమైన 'బిగ్‌బాస్ తమిళం – రెండో సీజన్'లో పాల్గొని మరింత ప్రజాదరణను సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఆమెకు అభిమానులను మరింత పెంచింది. తర్వాత 'జాంబీ', 'సిల నొడిగలిల్', 'వెపన్', 'డీడీ నెక్స్ట్ లెవల్' వంటి చిత్రాల్లో నటించిన యషికా ప్రస్తుతం 'టీఎన్ 2026', 'రాజభీమ', 'కలెక్టర్', 'టాస్' తదితర చిత్రాలతో బిజీగా ఉన్నారు. మోడల్‌గా ప్రారంభమైన ఆమె ప్రస్థానం ప్రస్తుతం దక్షిణ భారత చిత్రసీమలో గుర్తింపు పొందిన నటిగా కొనసాగుతోంది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉంటూ యువతలో మంచి ఆదరణను పొందుతున్నారు.

## టాక్సిక్ నుంచి లేడీస్ అండీస్ గ్లింప్స్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ గ్లింప్స్ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న హై-బడ్జెట్ చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఇప్పటివరకు యష్ లుక్స్, యాక్షన్‌తోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన మేకర్స్, తాజాగా ఈ చిత్రంలోని పవర్‌ఫుల్ మహిళా పాత్రలను పరిచయం చేస్తూ మరింత బోల్డ్‌గా 'లేడీస్ అండ్ లేడీస్' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ ఊహించని విధంగా అత్యంత బోల్డ్, రా అండ్ రస్టిక్ విజువల్స్‌తో సాగింది. చిత్రంలో నటిస్తున్న లేడీస్ అందరినీ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఎంతో పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేశారు. నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా, మరియు రుక్మిణి వసంత్ లతో కూడిన ఈ భారీ లేడీ కాస్టింగ్ గ్లింప్స్‌లో మునుపెన్నడూ చూడని బోల్డ్ అవతార్లలో కనిపించి షాక్ ఇచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అద్భుతమైన విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. 'డాడీ ఈజ్ హోమ్' అంటూ యష్ ఎంతటి పవర్‌ను చూపించాడో, ఈ లేడీ గ్యాంగ్ అంతకంటే ఎక్కువ 'టాక్సిక్'గా ఉండబోతోందని ఈ గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. కెవిఎన్ ప్రొడక్షన్స్ మరియు యష్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ పాన్-ఇండియా చిత్రం ఆగస్ట్ 26, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**